
RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | గురువారం | పేజీలు : 6
సంపుటి : 4, సంచిక : 34 | జనవరి 08, 2026 | వెల : రూ.3-00



4లో..

సీఎం సోదరుడు కొండల్ రెడ్డికి సిట్ నోటీసులు

# అమ్మో.. సర్కార్ ఆస్పత్రి!

## ప్రభుత్వ వైద్యం అంటేనే భయపడుతున్న సామాన్యులు



3లో..

- దవాఖానకు వెళ్లాలంటేనే జంకుతున్న జనం
- సిబ్బంది ప్రవర్తనతో విసిగిపోతున్న రోగులు
- వైద్యం కోసం వెళ్తే అవమానాలు.. ఈసడింపులు
- వార్డుల్లో పారిశుధ్య లోపం
- బెడ్లు లేక నేలపైనే వైద్యం
- కార్పొరేట్ ట్రీట్మెంట్ అంటూ ప్రభుత్వం గొప్పలు
- క్షేత్రస్థాయిలో మాత్రం రోగుల తిప్పలు
- సామాన్యుల్లో నమ్మకం కోల్పోతున్న వైద్య వ్యవస్థ

**వేద న్యూస్, ప్రత్యేక ప్రతినిధి :**

ఆరోగ్యం ప్రతి పౌరుడి మౌలిక హక్కు అని రాజ్యాంగం చెబుతున్నా, ఆ హక్కును పొందేందుకు ప్రభుత్వ ఆసుపత్రి గడప తొక్కాలంటే సామాన్యుడు భయపడాల్సిన పరిస్థితి రాష్ట్రంలో కనిపిస్తోంది. సర్కార్ ఆసుపత్రి అంటే పేదలకు భరోసా, అనారోగ్యంతో ఉన్నవారికి చివరి ఆశగా భావించిన రోజులు క్రమంగా మసకబారుతున్నాయన్న భావన ప్రజల్లో బలపడుతోంది. చికిత్స కోసం వెళ్లిన రోగికి మందుల కంటే ముందే నిర్లక్ష్యం, అవమానం ఎదురవుతోందన్న ఆరోపణలు రాష్ట్రవ్యాప్తంగా కొన్ని సర్కార్ ఆస్పత్రుల్లో వినిపిస్తున్నాయి. క్యూలో నిలబడ్డా పట్టించుకోని వైఖరి, ప్రశ్న అడిగితే చిరాకు, బెడ్లు లేక నేలపైనే చికిత్స తీసుకోవాల్సిన దుస్థితి నెలకొంది. ఒకవైపు వైద్య రంగంలో ఆధునిక సాంకేతికత, కొత్త భవనాలు, కోట్ల రూపాయల నిధుల కేటాయింపుల మాటలు వినిపిస్తుంటే.. మరోవైపు ప్రభుత్వ వైద్యశాలల్లో మానవీయ విలువలు కనుమరుగవుతున్నాయన్న విమర్శలు పెరుగుతున్నాయి. సిబ్బంది కొరతను కారణంగా చూపుతూ రోగుల పట్ల అమానవీయంగా వ్యవహరించడం, మౌలిక వసతుల లోపాలతో రోగులను అవమానానికి గురిచేయడం ప్రభుత్వ వైద్య వ్యవ స్థపై ప్రజల నమ్మకాన్ని తీవ్రంగా దెబ్బతీస్తోంది. రాష్ట్రంలోని పలు సర్కార్ ఆస్పత్రుల దుస్థితి, రోగుల దయనీయ పరిస్థితిపై 'వేద న్యూస్' అందిస్తున్న ప్రత్యేక కథనం..

# ప్రేమ పెళ్లికి ఒప్పుకోలేదని

- మేడిపల్లిలో ప్రేమ జంట ఆత్మహత్య
- ఒక్కరోజు వ్యవధిలోనే బలవన్మరణం
- రెండు కుటుంబాల్లో తీవ్ర విషాదం



**వేద న్యూస్, రంగారెడ్డి:**

రంగారెడ్డి జిల్లా యాచారం మండల పరిధిలోని మేడిపల్లి గ్రామంలో హృదయవిదారక ఘటన చోటుచేసుకుంది. ప్రేమ వివాహానికి పెద్దలు అంగీకరించకపోవడంతో ప్రేమ జంట ఆత్మహత్యకు పాల్పడింది. ఒక రోజు తేడాలో ఇద్దరూ ప్రాణాలు కోల్పోవడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మేడిపల్లి గ్రామానికి చెందిన మహేశ్ (20), అదే గ్రామానికి చెందిన ఓ బాలిక (16) గత నాలుగు నెలలుగా ప్రేమలో ఉన్నట్లు తెలిసింది. బాలిక ఇబ్రహీంపట్నంలోని కార్తికేయ కాలేజీలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. వీరి ప్రేమ విషయం ఇరు కుటుంబాలకు తెలియడంతో పెద్దలు ఇద్దరినీ కలవకుండా అడ్డుకున్నారు.పడ్డారు. ఇటీవల సోమవారం మహేశ్ బాలికకు ఫోన్ చేసి తనను పెళ్లి చేసుకోవాలని, లేదంటే ఆత్మహత్య చేసుకుం టాన ని చెప్పినట్లు సమాచారం. ఈ మాటలతో తీవ్ర మానసిక ఒత్తిడికి గురైన బాలిక మంగళవారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆమె మృతి విషయం తెలిసిన మహేశ్ తీవ్ర దిగ్భ్రాంతికి లోనై, బుధవారం పెట్రోల్ పోసుకుని నిప్పంటించు కుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ దుర్ఘటనతో రెండు కుటుంబాల్లోనూ తీవ్ర విషాదం నెలకొంది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రేమ వివాహాల విషయంలో కుటుంబాల మధ్య సంభాషణ, అవగాహన అవసరమని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

# సీఎం కప్-2025 రెండో ఎడిషన్‌కు శ్రీకారం

- గ్రామం నుంచి రాష్ట్ర స్థాయి వరకు విస్తృత క్రీడా పోటీలు
- 8 నుంచి 17 వరకు టార్చ్ ర్యాలీ 44 రకాల క్రీడల్లో శాట్స్ నిర్వహణ



**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి:**

గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఈ నెలలో జరగనున్న క్రీడా పోటీలకు సంబంధించి చీఫ్ మినిస్టర్స్ కప్-2025 రెండో ఎడిషన్ పోస్టర్‌ను ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. రాష్ట్రవ్యాప్తంగా క్రీడలకు మరింత ప్రోత్సాహం ఇచ్చే లక్ష్యంతో ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ క్రీడా పోటీలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఈ నెల 8 నుంచి 17 వరకు పది రోజుల పాటు టార్చ్ ర్యాలీ కొనసాగనుంది. డిసెంబర్‌లో జరగాల్సిన ఈ పోటీలు వివిధ కారణాలతో వాయిదా పడగా, తాజా షెడ్యూల్ ప్రకారం ఇప్పుడు నిర్వహించేందుకు నిర్ణయించారు. పోటీల

మిగతా 3వ పేజీలో..

# బీఆర్ఎస్ పాలనలోనే రైతులకు భరోసా



- యూరియా కొరత గత ప్రభుత్వంలో చూశారా?
- కాంగ్రెస్ ఎగవేతల ప్రభుత్వం
- ఇచ్చిన హామీలు ఏమయ్యాయి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- ఖమ్మంలో నూతన సర్పంచుల అభినందన సభ

**వేద న్యూస్, ఖమ్మం:**

బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో రైతులకు యూరియా కొరత లేదని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైతులు లైన్లలో నిలబడే పరిస్థితి వచ్చిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఖమ్మం నగరంలో నిర్వహించిన బీఆర్ఎస్ నూతన సర్పంచులు, ఉప సర్పంచుల అభినందన సభలో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై తీవ్ర విమర్శలు గుప్పించారు. యూరియా దుకాణాల్లో లేకపోతే యాప్‌లలో ఎలా కనిపిస్తుందో చెప్పాలని ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి కంటే కూల్చివేతలు, ఎగవేతలే ఎక్కువగా కనిపిస్తున్నాయని విమర్శించారు. కౌలు రైతులకు ఇవ్వాల్సిన సాయం, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఏమయ్యాయని నిలదీశారు. రెండేళ్ల పాలనలో ఒక్క స్పష్టమైన అభివృద్ధి కార్యక్రమం కూడా చూపించలేకపోతున్నారని అన్నారు. ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేయాలనే

మిగతా 3వ పేజీలో..

# 'రెవెన్యూ'ను సమూలంగా సంస్కరించాం

- గ్రామ స్థాయి వరకూ బలోపేతం చేశాం
- భూభారతి పోర్టల్ దేశానికే ఆదర్శం
- భూ వివాదాలకు శాశ్వత పరిష్కారమే లక్ష్యం
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**వేద న్యూస్, హైదరాబాద్, ప్రతినిధి:**

గడిచిన రెండేళ్లలో రెవెన్యూ వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చి గ్రామ స్థాయి వరకు బలోపేతం చేసినట్లు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. హైదరాబాద్ నాంపల్లిలోని ట్రెస్సా కార్యాలయంలో నిర్వహించిన తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ 2026 డైరీ ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో భ్రష్టుపట్టిన రెవెన్యూ వ్యవస్థను సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో సమూలంగా సంస్కరించామని మంత్రి

మిగతా 3వ పేజీలో..

# భక్తులకు ఇబ్బందులు లేకుండా పనులు పూర్తి చేయాలి

- సీఎం పర్యటన సందర్భంగా సభ ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి
- మేడారం మహా జాతర ఏర్పాట్ల పరిశీలన - మంత్రి సీతక్క



**వేద న్యూస్, మేడారం:**

ప్రపంచ ప్రఖ్యాత మేడారం సమ్మక్క-సారలమ్మ మహా జాతర ఏర్పాట్లను పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా-శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క పరిశీలించారు. జాతరకు తరలివచ్చే లక్షలాది భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జాతర ప్రాంగణంలో తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, వైద్య సదుపాయాలు, రవాణా మార్గాలు, క్యూ లైన్లు వంటి మౌలిక వసతుల పనులను వేగవంతం చేయాలని సూచించారు. భక్తుల రాకపోకలు సజావుగా సాగేందుకు ట్రాఫిక్ నిర్వహణపై ముందస్తు ప్రణాళికలు అమలు చేయాలని తెలిపారు. ఈ నెల 18న ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి మేడారం పర్యటన సందర్భంగా నిర్వహించే సభకు అవసరమైన వేదిక, విద్యుత్, శబ్ద వ్యవస్థలు, పార్కింగ్ వంటి ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని మంత్రి సీతక్క అధికారులకు స్పష్టం చేశారు. భద్రతా ఏర్పాట్లలో ఎలాంటి లోపాలు ఉండకూడదని, పోలీస్, అగ్నిమాపక, వైద్య విభాగాల మధ్య సమన్వయం ఉండాలన్నారు. అదేవిధంగా ఆదివాసీ సంప్రదాయాలు, జాతర ప్రత్యేకతలు దెబ్బతినకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రభుత్వ యంత్రాంగం సమిష్టిగా పనిచేసి మేడారం మహా జాతరను విజయవంతంగా నిర్వహించాలన్నారు. భక్తుల సౌకర్యాలే ప్రధాన లక్ష్యంగా అన్ని శాఖలు బాధ్యతతో వ్యవహరించాలని మంత్రి ఆదేశించారు.

వేద న్యూస్

గురువారం జనవరి 08, 2026

# రాష్ట్ర అధ్యక్షుడి పర్యటన విజయవంతం చేద్దాం

**– బీజేపీ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్**



**వేద న్యూస్, వరంగల్ టౌన్:**

భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు మరియు మాజీ ఎమ్మెల్సీ ఎన్. రామచందర్ రావు గురువారం (నేడు) వరంగల్ జిల్లాలో పర్యటించనున్నట్లు వరంగల్ నగర కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా నాయకులకు కార్యకర్తలను ఉద్దేశించి బీజేపీని బలోపేతం చేసే దిశగా మరియు ప్రజా సమస్యలపై పోరాటాన్ని ఉధృతం చేసే లక్ష్యంతో రాష్ట్ర అధ్యక్షులు జిల్లా పర్యటనకు వస్తున్నారన్నారు. ఈ పర్యటన జిల్లా పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్న అని తెలిపారు. పార్టీ పటిష్టత మరియు భవిష్యత్ కార్యాచరణపై రాష్ట్ర అధ్యక్షులు స్థానిక నాయకులతో మరియు కార్యకర్తలతో సమావేశమవుతారు. జిల్లాలో నెలకొన్న ప్రస్తుత రాజకీయ పరిస్థితులు మరియు ప్రజా సమస్యలపై దిశానిర్దేశం చేస్తారు. జనవరి 8వ తేదీన జిల్లాకు చేరుకోనున్న రామచందర్ రావుకి పార్టీ శ్రేణులు వరంగల్ చౌరస్తా నుండి బైక్ ర్యాలీ ద్వార రాజశ్రీ గార్డెన్ వరకు భారీ ఎత్తున ఘన స్వాగతం పలుకుతున్నట్లు అన్నారు. వరంగల్ జిల్లాలోని బీజేపీ నాయకులు, శక్తి కేంద్రాల ఇన్చార్జీలు, బూత్ స్థాయి కార్యకర్తలు, అనుబంధ సంఘాల ప్రతినిధులు మరియు పార్టీ అభిమానులు, ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి రాష్ట్ర అధ్యక్షుల పర్యటనను అత్యంత విజయవంతం చేయాలని "రాష్ట్ర అధ్యక్షుల రాక జిల్లా బీజేపీ చరిత్రలో ఒక మైలురాయిగా నిలవాలని, మన ఐక్యతను చాటి చెప్పదామని తెలిపారు.

# ముగ్గుల పోటీల విజేతలకు సన్మానం

- మహిళలతోనే రాష్ట్రము, గ్రామాల అభివృద్ధి
- ఇందిరానగర్ గ్రామ సర్పంచ్ అంబాల రాజ్ కుమార్



**వేద న్యూస్, ఎల్కతుర్తి :**

ఇందిరానగర్ గ్రామంలో బుధవారం నిర్వహించిన ముగ్గుల పోటీల్లో గెలుపొందిన మహిళలను గ్రామ సర్పంచి అంబాల రాజు శాలువాలతో సన్మానించారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన సాతూరి ప్రవలిక, గంగారపు రవళి, కడారి నవ్యశ్రీ, కడారి నవ్య, దాసరపు మరియాలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా అంబాల రాజ్ కుమార్ మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. మహిళల ప్రతిభను వెలికి తీసేందుకు ఇలాంటి పోటీలు ఎంతగానో దోహదపడతాయని, మహిళలను ప్రోత్సహించడం ద్వారా గ్రామాభివృద్ధి మరింత వేగవంతమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచి అంబాల రాజుతో పాటు ఉప సర్పంచి కోరే లావణ్య, వార్డు సభ్యులు కడారి సుధాకర్, నక్క రాకేష్, గ్రామపంచాయతీ కార్యదర్శి గబ్బేట స్వామి, వివో అధ్యక్షురాలు గొర్రె శ్రీలత, విఓఏ తాడూరి సుమలత, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఐఎంఎస్ భవన నిర్మాణం త్వరగా పూర్తిచేయాలి

- మహిళా దినోత్సవంలోగా అందుబాటులోకి తీసుకురావాలి
- ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్



**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల**

ఇందిరా మహిళా శక్తి (ఐఎంఎస్) భవన నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేసి మహిళా దినోత్సవం నాటికి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని ప్రభుత్వ వైద్య కళాశాల సమీపంలో రూ.5 కోట్ల నిధులతో పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న ఇందిరా మహిళా శక్తి భవనాన్ని బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ ప్లాన్‌లను ముందుగా పరిశీలించి, పనుల పురోగతిపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. భవన నిర్మాణ పనుల కోసం కార్మికుల సంఖ్యను పెంచి, మార్చి 8వ తేదీలోగా పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఈఈ పీఆర్ సుదర్శన్ రెడ్డికి ఇంచార్జి కలెక్టర్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ పరిశీలన కార్యక్రమంలో జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు భాగ్య, డీఆర్డీఓ గీత, ఈఈ పీఆర్ సుదర్శన్ రెడ్డి, తహసీల్దార్ మహేష్ కుమార్, ఏఈ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# నూతన ఆర్టీసీ బస్సు ప్రారంభించిన మంత్రి వివేక్




**వేద న్యూస్, మందమర్రి టౌన్**

మందమర్రి పట్టణంలో నూతనంగా ప్రవేశపెట్టిన ఆర్టీసీ బస్సు సర్వీసును కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి బుధవారం ప్రారంభించారు. మందమర్రి ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో, మందమర్రి నుంచి రామకృష్ణాపూర్ మీదుగా జిల్లా కేంద్రం మంచిర్యాల బస్టాండ్ వరకు నడిచే నూతన ఆర్టీసీ సర్వీసును జెండా ఊపి బస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ, ప్రజలకు నాణ్యమైన, సురక్షితమైన ప్రజా రవాణా సేవలు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. గ్రామాలు, పట్టణాలను అనుసంధానించేలా ఆర్టీసీ సేవలను మరింత విస్తరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ఈ నూతన బస్సు సౌకర్యంతో మందమర్రి, రామకృష్ణాపూర్ పరిసర ప్రాంతాల ప్రజలకు జిల్లా కేంద్రం మంచిర్యాలకు వెళ్లేందుకు ప్రయాణం మరింత సులభంగా మారుతుందని చెప్పారు. అనంతరం మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ, ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని రవాణా సౌకర్యాల అభివృద్ధికి జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో సహకరిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, కార్మిక సంఘాల నాయకులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బీసీ సబ్ ప్లాన్ అమలు చేయాలని వినతి




**వేద న్యూస్, శాయంపేట:**

తెలంగాణ రాజ్యాధికార పార్టీ వ్యవస్థాపకుడు తీన్మార్ మల్లన్న ఆదేశాల మేరకు, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి పల్లె బోయిన అశోక్ ముదిరాజ్, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ గౌడ్, తెలంగాణ రాష్ట్ర యూత్ అధ్యక్షుడు బొడ్డుపల్లి చంద్రశేఖర్ సూచనలతో హనుమకొండ జిల్లా శాయంపేట తహసీల్దార్ కార్యాలయంలో బీసీ సబ్ ప్లాన్‌ను వెంటనే అమలు చేయాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, బీసీ వర్గాల అభివృద్ధికి బీసీ సబ్ ప్లాన్ కీలకమని, ప్రభుత్వం ప్రకటించిన నిధులు పూర్తిస్థాయిలో అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీసీ సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో అమలుకావాలంటే స్పష్టమైన ప్రణాళికతో పాటు పర్యవేక్షణ అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ హనుమకొండ జిల్లా యూత్ అధ్యక్షులు తీన్మార్ జయ్‌తో పాటు తెలంగాణ రాజ్యాధికార పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# ప్రజలకు చేరువయ్యేలా పోలీస్ విధులు

- విజిబుల్ పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించాలి
- జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే
- ఇల్లంతకుంట పోలీస్ స్టేషన్ తనిఖీ



**వేద న్యూస్, ఇల్లంతకుంట :**

ప్రజలకు మరింత చేరువయ్యేలా పోలీస్ విధులు ఉండాలని, ప్రతి ఫిర్యాదుపై తక్షణమే స్పందించి బాధితులకు చట్టప్రకారం న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే అన్నారు. ఇల్లంతకుంట పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ మహేష్ బి. గితే తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసరాలు, వివిధ కేసుల్లో సీజ్ చేసిన వాహనాల వివరాలు, స్టేషన్‌కు సంబంధించిన పలు రికార్డులను ఆయన పరిశీలించారు. అలాగే స్టేషన్ భౌగోళిక మ్యాప్‌ను అధ్యయనం చేసి, పరిధిలోని క్రైమ్ హాట్‌స్పాట్స్ వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పెండింగ్ కేసులు, కోర్టు కేసులు, ప్రస్తుతం దర్యాప్తులో ఉన్న కేసుల పురోగతిని క్షుణ్ణంగా సమీక్షించి అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల పరిస్థితులు, నేరాల స్థితిగతులపై సవివరంగా విచారించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. గతంతో పోలిస్తే నేరాల రేటు తగ్గుముఖం పట్టిందని పేర్కొన్నారు. కేసుల దర్యాప్తులో వేగం పెంచుతూ, సాక్ష్యుల సేకరణలో నిష్పక్షపాత దృక్పథంతో వ్యవహరించాలని అన్నారు. పోలీస్ స్టేషన్ అధికారులు, సిబ్బంది పనితీరును అభినందించిన ఎస్పీ, స్టేషన్ పరిసరాల్లో 5ఎస్ విధానాన్ని పాటిస్తూ పరిశుభ్రతను కాపాడాలని, ఫైళ్లను క్రమపద్ధతిలో నిర్దేశిత ప్రదేశాల్లో ఉంచాలని సూచించారు. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా, క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని ఆదేశించారు. పోలీస్ శాఖ వినియోగిస్తున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అధికారులు, సిబ్బందికి పూర్తి అవగాహన ఉండాలని, సిబ్బందికి ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. అలాగే పోలీసులు తరచూ గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజలతో సత్సంబంధాలు కొనసాగించాలని, అసాంఘిక కార్యకలాపాలు లేదా శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అంశాలపై వెంటనే సమాచారం అందేలా ఇన్ఫర్మేషన్ వ్యవస్థను మరింత పటిష్టం చేయాలని ఆదేశించారు. మహిళల భద్రత, సైబర్ నేరాల నివారణ, మాదక ద్రవ్యాల నిర్మూలనతో పాటు వాటి వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, యువతలో చట్టం పట్ల గౌరవం పెంపొందించేందుకు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఎస్పీ సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐ మొగిలి, ఎస్ఐ అశోక్‌తో పాటు పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఆర్థిక సహాయం అందజేత



**వేద న్యూస్, నల్లబెల్లి :**

నల్లబెల్లి మండలం, రుద్రగూడెం గ్రామానికి చెందిన తోర్నే రంజిత్ అనే నిరుపేద దివ్యాంగ యువకునికి పోషణ మరియు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.5 వేల ఆర్థిక సహాయాన్ని అందజేయడం జరిగింది. నల్లబెల్లి ఎంఆర్సీ కార్యాలయంలో ఐఈఆర్పీగా పనిచేస్తున్న సంధ్యారాణి, తోర్నె రంజిత్ దయనీయ స్థితిని, పంతులుపల్లి ప్రాథమిక పాఠశాల హెడ్మాస్టర్ కర్ణకంటి రాంమూర్తి దృష్టికి తీసుకురాగా, గీసుకొండకు చెందిన అతని పూర్వ విద్యార్థులు 1997-98 బ్యాచ్ వారి సౌజన్యంతో ఇట్టి సాయం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పంతులుపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు కూనమళ్ల రాజన్ బాబు, నల్లబెల్లి ఎంఆర్సీ కార్యాలయ ఎంఐయస్ కోఆర్డినేటర్ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# వార్డుల్లో పర్యటించిన సర్పంచ్



**వేద న్యూస్, రుద్రూర్:**

రుద్రూర్ మండల కేంద్రంలోని అంబంగల్లీ 8వ వార్డులో గ్రామ సర్పంచ్ ఇందూరు సునీత బుధవారం ఇంటింటికి తిరుగుతూ ప్రజాసమస్యలను అడిగి తెలుసుకున్నారు. వార్డులో నెలకొన్న మౌలిక వసతుల సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించి, ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరించారు. ఈ సందర్భంగా డ్రైనేజీలు, త్రాగునీటి కుళాయిలు, వీధి విద్యుత్ లైట్లు తదితర సమస్యలను సర్పంచ్ గమనించారు. వార్డులో ఉన్న సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని, గ్రామ అభివృద్ధికి అందరి సహకారం అవసరమని వార్డు ప్రజలకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ షేక్ నిస్సార్, వార్డు మెంబర్ బోజిగొండ అనీల్, గాండ్ల శ్రీను, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ చీరెల పంపిణీ



**వేద న్యూస్, ఇబ్రహీంపట్నం:**

ఇందిరమ్మ చీరెలు పంపిణీ కార్యక్రమంలో భాగంగా ఇబ్రహీంపట్నం మండలం వర్షకొండ గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామ సర్పంచ్ పొనుకంటి చిన్న వెంకట్ మహిళలకు చీరెలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ చిన్న వెంకట్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం నిజమైన ప్రజా ప్రభుత్వమని, మహిళల సంక్షేమమే ధ్యేయంగా ఇందిరమ్మ చీరెల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. సంక్రాంతి పండుగలోపే మహిళలకు చీరలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకు చీరె అందేలా చర్యలు తీసుకుంటున్నామని, మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. అర్హులైన మహిళలందరికీ తప్పకుండా చీరల పంపిణీ జరుగుతుందని హామీ ఇచ్చారు. మహిళలు గ్రామాల్లో కొత్త సంఘాలుగా ఏర్పడి ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, పారిశ్రామిక వ్యాపారాలు ప్రారంభించి ఆర్థికంగా ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ తుమ్మల జయ నర్సయ్య, వార్డ్ సభ్యులు చంద్రశేఖర్, రాకేష్, లావణ్య, నవనీత, సీసీ పురుషోత్తం, వీవోఎస్‌లు లక్ష్మి, అప్సర, రుక్సానా, వీవోఎస్ అధ్యక్షులు వనిత, భూదేవి తదితరులు పాల్గొన్నారు.

# మార్కెట్ యార్డు మరమ్మతులకు నిధుల మంజూరు

**– మార్కెట్ కమిటీ చైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్**



**వేద న్యూస్, బోయినిపల్లి:**

బోయినిపల్లి మార్కెట్ కమిటీ అభివృద్ధి, మరమ్మతుల కోసం ప్రభుత్వం రూ.14 లక్షల నిధులు మంజూరు చేసినట్లు మార్కెట్ కమిటీ చైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్ తెలిపారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కృషితో బోయినిపల్లి మార్కెట్ కమిటీ అభివృద్ధి, మరమ్మత్తుల కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ నిధులతో మార్కెట్ యార్డులో కూలిపోయిన ప్రహరీ గోడను పునర్నిర్మించడం, అలాగే మార్కెట్ యార్డు కార్యాలయ భవనానికి అవసరమైన మరమ్మతు పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. మార్కెట్ యార్డులో మౌలిక సదుపాయాల అభివృద్ధి ద్వారా రైతులు, వ్యాపారులు మరింత సౌకర్యంగా సేవలు పొందగలుగుతారని చైర్మన్ ఎల్లేష్ యాదవ్ అన్నారు. నిధుల మంజూరుపై హర్షం వ్యక్తం చేసిన ఆయన, ఈ సహకారం అందించిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నిమ్మ వినోద్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు కూడా ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

# అమ్మో.. సర్కార్ ఆస్పత్రి!

## ప్రభుత్వ వైద్యం అంటేనే భయపడుతున్న సామాన్యులు



- ☐ దవాఖానకు వెళ్లాలంటేనే జంకుతున్న జనం
- ☐ సిబ్బంది ప్రవర్తనతో విసిగిపోతున్న రోగులు
- ☐ వైద్యం కోసం వెళ్తే అవమానాలు.. ఈసడింపులు
- ☐ వార్డుల్లో పారిశుధ్య లోపం
- ☐ బెడ్లు లేక నేలపైనే వైద్యం
- ☐ కార్పొరేట్ ట్రీట్మెంట్ అంటూ ప్రభుత్వం గొప్పలు
- ☐ క్షేత్రస్థాయిలో మాత్రం రోగుల తిప్పలు
- ☐ సామాన్యుల్లో నమ్మకం కోల్పోతున్న వైద్య వ్యవస్థ

**వేద న్యూస్, ప్రత్యేక ప్రతినిధి:**

ఆరోగ్యం ప్రతి పౌరుడి ప్రాథమిక హక్కు. కానీ నేటి పరిస్థితుల్లో అనారోగ్యం పాలైన వారు ప్రభుత్వ ఆస్పత్రి గడప తొక్కాలంటే భయపడుతున్నారు. సర్కార్ ఆసుపత్రి అంటే పేదలకు భరోసా. అనారోగ్యంతో ఉన్నవారికి చివరి ఆశ. కానీ ఇప్పుడు అదే ఆసుపత్రి భయానికి, అవమానానికి ప్రతీకగా మారుతోంది. చికిత్స కోసం వెళ్లిన రోగికి మందులకంటే ముందు మాటల దెబ్బ తగులుతోందన్న ఆరోపణలు రోజురోజుకూ పెరుగుతున్నా యి. క్యూలో నిలబడినా పట్టించుకోని వైఖరి, ప్రశ్న అడిగితే చిరాకు, బెడ్లు లేక నేలపైనే చికిత్స.. ఇవన్నీ రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికీ అనేక ప్రభుత్వ ఆసుపత్రుల్లో కనిపిస్తున్న దృశ్యాలు. ప్రభుత్వ ఆసుపత్రి గడప తొక్కాలంటే సామాన్యుడు భయపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఒకవైపు అత్యాధునిక సాంకేతికత అందుబాటులోకి వస్తున్నా, మరోవైపు ప్రభుత్వ వైద్యశాలల్లో మానవీయ విలువలు కనుమరుగవుతున్నాయి. చికిత్స కోసం వెళ్లిన రోగికి ఆరోగ్యం కంటే ముందు అవమానం ఎదురవుతుందన్నది చేదు నిజం. రాష్ట్రంలోని పలు సర్కార్ ఆస్పత్రుల దుస్థితి, రోగుల దయనీయ పరిస్థితిపై 'వేద న్యూస్' అందిస్తున్న ప్రత్యేక కథనం..

**- అమానవీయంగా సిబ్బంది ప్రవర్తన**

వైద్యుడిని దైవంగా భావించే సమాజం మనది. అయితే, ప్రభుత్వ ఆసుపత్రుల్లో మాత్రం రోగుల పట్ల సిబ్బంది ప్రవర్తన తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. ఓపీ క్యూ లైన్ల నుంచి వార్డుల వరకు సిబ్బంది బాధితులతో మాట్లాడే తీరు అమానవీయంగా ఉంటోంది. ప్రశ్న అడిగితే విసుక్కోవడం, సహాయం కోరితే నిర్లక్ష్యం చేయడం సర్వసాధారణమైపోయింది. అనారోగ్యంతో వచ్చిన వారికి మానసిక ధైర్యం చెప్పాల్సింది పోయి, వారిని మరింత కుంగదీసేలా ప్రవర్తించడం వ్యవస్థలోని లోపానికి నిదర్శనం. ప్రభుత్వ ఆసుపత్రుల్లో నిర్లక్ష్యం అనే మాటకు సిబ్బంది కొరతను ఒక సాకుగా చూపుతున్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న రోగి ఆసుపత్రి గడప దాటిన క్షణం నుంచి పరీక్ష మొదలవుతోందన్న భావన కలుగుతోంది. 'ఇక్కడే కూర్చో', 'ఇంతకంటే ఏమి కావాలి?', 'ఇంత మందికి ఒక్క డాక్టర్ ఉన్నాడు' అన్న మాటలు రోగి మనసును మరింత గాయపరుస్తున్నాయి. ఆసుపత్రి అంటే ఊరట కాదు.. ఒత్తిడిగా మారుతోందన్న ఆవేదన సామాన్యుల్లో బలంగా వినిపిస్తోంది.

**- సిబ్బంది కొరత.. నిర్లక్ష్యానికి కారణమా?**

ప్రభుత్వ ఆసుపత్రుల్లో డాక్టర్లు, నర్సులు, సహాయక సిబ్బంది కొరత వాస్తవమే. ఒక డాక్టర్‌పై వందల మంది రోగుల భారం. పనిభారం ఎక్కువైతే సేవల నాణ్యత తగ్గడం సహజం.కానీ అదే కొరతను కారణంగా చూపుతూ రోగుల పట్ల నిర్లక్ష్యంగా, అవమానకరంగా ప్రవర్తించడం ఎంతవరకు సమంజసం అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. రోగి బాధను అర్థం చేసుకునే మానవీయ దృక్పథం ఎందుకు కనిపించడం లేదనే ప్రశ్నలు సమాధానం లేని వైనంగా నిలుస్తున్నాయి.

**- క్షేత్రస్థాయిలో లోపాలు**

ప్రభుత్వం వైద్య రంగంలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని చెబుతోంది. ఉచిత చికిత్స, ఉచిత మందులు, ఉచిత పరీక్షలు అంటూ ప్రకటనలు వెలువడుతున్నాయి. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉందన్న ఆరోపణలు తీవ్రంగా ఉన్నాయి. మందులు లేవు.. పరికరాలు పనిచేయడం లేదు.. అనే మాటలు కొన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో తరచూ వినిపిస్తున్నాయి. టెస్టుల కోసం బయటకు పంపించడం.. వైద్యం కోసం వెళ్తే ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లమంటూ సూచనలు ఇవ్వడంతో ఇదేనా ప్రజలకు అందాల్సిన ఉచిత వైద్యం? అన్న రోగుల ప్రశ్నిస్తున్నారు.

**- వేధిస్తున్న మౌలిక వసతుల కొరత**

మౌలిక వసతుల కొరత, సిబ్బంది నియామకాల్లో జాప్యం, పర్యవేక్షణ లోపం కొనసాగితే ప్రభుత్వ వైద్య వ్యవస్థపై ప్రజల నమ్మకం మరింత క్షీణించే ప్రమాదం ఉంది. ముఖ్యంగా బెడ్ల కొరత వల్ల నేలపైనే పడుకోవాల్సిన పరిస్థితి ఒకెత్తయితే, దుర్వాసన కొట్టే వార్డులు, అపరిశుభ్రమైన మరుగుదొడ్లు రోగి ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తున్నాయి. పేదవాడు ప్రభుత్వ ఆసుపత్రికే వెళ్లాలన్న నమ్మకం కోల్పోతే.. ఆరోగ్య వ్యవస్థ లక్ష్యమే విఫలమైనట్టే. ప్రభుత్వ ఆసుపత్రులు నిజంగా ప్రజల భరోసా కేంద్రాలుగా మారాలంటే.. సరిపడా వైద్య సిబ్బంది నియామకాలు జరగాలి. మౌలిక సదుపాయాలను బలోపేతం చేయాలి. రోగులతో గౌరవప్రదంగా వ్యవహరించాల్సిన అవసరం కూడా ఉంది. ఇక ఒక డాక్టర్ వందలాది మందిని చూడాల్సి రావడం వల్ల నాణ్యమైన చికిత్స అందడం లేదనేది వాస్తవం. ఖాళీగా ఉన్న నర్సింగ్, పారా మెడికల్ పోస్టులను భర్తీ చేయకపోవడం వల్ల ఉన్న సిబ్బందిపై భారం పడి, అది రోగులపై అసహనంగా మారుతోంది.

**- ఆరోగ్య హక్కు.. నినాదమేనా?**

ఆరోగ్యం ప్రతి పౌరుడి మౌలిక హక్కు అని రాజ్యాంగం స్పష్టంగా చెబుతోంది. కానీ ప్రభుత్వ ఆసుపత్రుల్లో జరుగుతున్న అనుభవాలు ఆ హక్కు ఆచరణలో ఉందా? అనే సందేహాలను రేకెత్తిస్తున్నాయి. చికిత్స కోరుకుని వచ్చిన రోగిని గౌరవంగా చూడలేని వ్యవస్థ ప్రజల విశ్వాసాన్ని ఎలా నిలబెట్టుకుంటుంది? వైద్యం అంటే మందులే కాదు.. మానవత్వం కూడా కావాలి. అంతేకానీ ఇలాగే కొనసాగితే ప్రభుత్వ వైద్య వ్యవస్థకు ప్రమాదమే.

**- నిధులు కేటాయిస్తే సరిపోతుందా?**

ఆధునిక భవనాలు నిర్మిస్తున్నా, లోపల అవసరమైన ఆక్సిజన్, అత్యవసర మందులు సకాలంలో అందడం లేదు. రాత్రి వేళల్లో సీనియర్ డాక్టర్లు అందుబాటులో ఉండకపోవడం వల్ల జూనియర్ డాక్టర్లపైనే భారం పడుతోంది. ఇది కొన్నిసార్లు ప్రాణాంతక తప్పిదాలకు దారితీస్తోంది. ప్రభుత్వ వైద్యంపై నమ్మకం పెరగాలంటే కేవలం నిధులు కేటాయిస్తే సరిపోదు, పర్యవేక్షణ పెరగాలి. ఆసుపత్రి సిబ్బందికి రోగులతో ఎలా ప్రవర్తించాలో శిక్షణ ఇవ్వాలి. నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులపై, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలి. ప్రతి ఆసుపత్రిలో రోగులు తమ సమస్యలను చెప్పుకోవడానికి ఒక స్వతంత్ర హెల్ప్ డెస్క్ ఉండాలి. నెలకు ఒకసారి యంత్రాల పనితీరు, మందుల నిల్వలపై ఆడిట్ నిర్వహించాల్సిన అవసరం ఉంది.

## బీఆర్ఎస్ పాలనలోనే రైతులకు భరోసా

లక్ష్యంతో కేసీఆర్ పని చేశారని గుర్తు చేశారు. ప్రస్తుతం ఇదే జిల్లా నుంచి ముగ్గురు మంత్రులు ఉన్నప్పటికీ, రైతులకు యూరియా అందించలేని పరిస్థితి నెలకొందని విమర్శించారు. కమీషన్ల కోసమే మంత్రులు పనిచేస్తున్నారని, 30 శాతం ట్యాక్స్ నడుస్తోందని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఆరు గ్యారెంటీలను భద్రంగా ఉంచుకుంటామని చెప్పిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాటలు ఏమయ్యాయని ప్రశ్నించారు. రెండేళ్లు గడిచినా గ్యారెంటీలు అమలు కాలేదని అన్నారు. ఇది సర్వభ్రష్ట ప్రభుత్వమని కేటీఆర్ తీవ్రంగా వ్యాఖ్యానించారు. ఈ సభలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యేలు, జిల్లా నాయకులు, బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. బీఆర్ఎస్ బలమైన ప్రతిపక్షంగా ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తుందని కేటీఆర్ స్పష్టం చేశారు.

## సీఎం కప్-2025 రెండో ఎడిషన్‌కు శ్రీకారం

నిర్వహణ షెడ్యూల్‌ను పరిశీలిస్తే, ఈ నెల 17 నుంచి 22 వరకు గ్రామ స్థాయిలో, 28 నుంచి 31 వరకు మండల స్థాయిలో, ఫిబ్రవరి 3 నుంచి 7 వరకు నియోజకవర్గ స్థాయిలో, ఫిబ్రవరి 10 నుంచి 14 వరకు జిల్లా స్థాయిలో, ఫిబ్రవరి 19 నుంచి 26 వరకు రాష్ట్ర స్థాయిలో పోటీలు జరగనున్నాయి. గ్రామం నుంచి రాష్ట్ర స్థాయి వరకు మొత్తం 44 రకాల క్రీడల్లో శాట్స్ ఆధ్వర్యంలో పోటీలను నిర్వహించనున్నారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో క్రీడలు, యువజన శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, శాట్స్ చైర్మన్ శివసేనా రెడ్డి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాసరాజు, శాట్స్ ఎండీ సోనీబాల తదితరులు పాల్గొన్నారు. క్రీడల ద్వారా యువతలో ఆరోగ్యం, క్రమశిక్షణ, పోటీ స్ఫూర్తి పెంపొందించడమే ఈ కార్యక్రమ లక్ష్యమని వారు పేర్కొన్నారు.

## 'రెవెన్యూ'ను సమూలంగా సంస్కరించాం



పేర్కొన్నారు. దశాబ్దాలుగా పెండింగ్ లో ఉన్న భూవివాదాలకు శాశ్వత పరిష్కారం లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన భూభారతి పోర్టల్ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు.రైతుల భూములకు సంబంధించి కీలకమైన సర్వే విభాగాన్ని బలోపేతం చేయడానికి ఇప్పటికే 3,500 మంది లైసెన్స్ సర్వేయర్లను నియమించామని, మరో వారం రోజుల్లో మరో 3 వేల మందిని తీసుకోనున్నట్లు వెల్లడించారు. దీని ద్వారా భూసమస్యల పరిష్కారం వేగవంతమవుతుందని ఆయన తెలిపారు.ప్రభుత్వ ఉద్యోగులకు అందాల్సిన ప్రయోజనాలు రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల కారణంగా కొంత ఆలస్యం అవుతున్నప్పటికీ, వాటిని క్రమంగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఉద్యోగుల సహకారంతోనే రెవెన్యూ వ్యవస్థను మరింత సమర్థవంతంగా ప్రజలకు చేరువ చేసే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంత్రి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ట్రెస్సా అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## తెలుగులో ఛార్జ్‌షీట్!



**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి:**

పోలీస్ దర్యాప్తు, కోర్టు ప్రక్రియలు ఇప్పటికీ ప్రధానంగా ఇంగ్లిష్‌కే పరిమితమై ఉన్న నేపథ్యంలో, తెలంగాణ పోలీస్ శాఖలో ఒక సరికొత్త అధ్యాయం ప్రారంభమైంది. సామాన్యులకు సులభంగా అర్థమయ్యేలా మాతృభాష తెలుగులోనే అభియోగపత్రం (ఛార్జ్‌షీట్) దాఖలు చేసి, దుండిగల్ పోలీస్ స్టేషన్‌కు చెందిన హెడ్ కానిస్టేబుల్ స్వరూప ప్రత్యేక ప్రశంసలు అందుకున్నారు. ఇంగ్లిష్ పరిజ్ఞానం లేని బాధితులు, నిందితులు కూడా కేసు వివరాలను స్పష్టంగా అర్థం చేసుకోవాలనే ఉద్దేశంతో, 2025లో రెండు కేసులకు సంబంధించిన దర్యాప్తు నివేదికలను పూర్తిగా తెలుగులో సిద్ధం చేసి మేడ్చల్ కోర్టులో సమర్పించడం విశేషంగా నిలిచింది. ఇది పోలీస్ వ్యవస్థలో భాషా సంస్కరణలకు నాంది పలికిన చర్యగా అధికారులు భావిస్తున్నారు. దర్యాప్తులో భాగంగా ఒక మిస్సింగ్ కేసును వేగంగా ఛేదించి, తల్లిఉబిడ్డలను క్షేమంగా గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించడం ద్వారా స్వరూప తన కర్తవ్యనిబద్ధతను చాటుకున్నారు. సత్వర న్యాయం, బాధితుల పట్ల మానవీయ దృక్పథం పోలీస్ విధుల్లో ఎంత కీలకమో ఆమె చర్యలు స్పష్టం చేశాయి. ఈ వినూత్న ప్రయత్నానికి మార్గదర్శకత్వం అందించిన శంకర్ రెడ్డి సహకారంతో తెలుగులో అభియోగపత్రాల దాఖలు సాధ్యమైంది. రాష్ట్ర అధికార భాషలో దర్యాప్తు పూర్తి చేసినందుకు గాను, బంజారాహిల్స్‌లోని కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ లో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర డీజీపీ బి. శివధర్ రెడ్డి, ఐపీఎస్ అధికారి శిఖా గోయల్ చేతుల మీదుగా స్వరూపకు ప్రశంసలు అందాయి. తెలుగులో ఛార్జ్‌షీట్ దాఖలు చేసిన ఈ ప్రయత్నం న్యాయవ్యవస్థను ప్రజలకు మరింత చేరువ చేసే దిశగా ఒక కీలక అడుగుగా అధికారులు అభిప్రాయపడుతున్నారు. భవిష్యత్తులో మరిన్ని కేసుల్లో మాతృభాష వినియోగం పెరగాలని, ఇది పోలీస్ శాఖలో ఒక ఆదర్శంగా నిలవాలని పలువురు ఆకాంక్షిస్తున్నారు.

## పతంగుల పండుగకు రండి..



**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి:**

సంక్రాంతి పండుగ సందర్భంగా హైదరాబాద్ నగరంలో నిర్వహించనున్న పతంగుల పండుగ వేడుకలకు గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ముఖ్య అతిథిగా పాల్గొనాలని ఖైరతాబాద్ శాసనసభ్యులు దానం నాగేందర్తో కలిసి ఆహ్వానించారు. జనవరి 14న హైదరాబాద్‌లోని ప్రసాద్ ఐమాక్స్ పక్కన ఈ పతంగుల పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. నగరవాసులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని సంక్రాంతి సంబరాలను ఆనందంగా జరుపుకునేలా ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సంప్రదాయ పద్ధతిలో ఆహ్వానం అందజేసి, పతంగుల పండుగ ద్వారా తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల ప్రాధాన్యతను మరింతగా ప్రజలకు చాటేలా కార్యక్రమం ఉండబోతుందని వివరించారు. నగరంలో సంక్రాంతి పండుగ వాతావరణాన్ని ఉత్సవంగా మార్చే ఈ పతంగుల వేడుకలు హైదరాబాద్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయని, ముఖ్యమంత్రి హాజరు వేడుకలకు మరింత శోభనిచ్చే అంశమవుతుందని నిర్వాహకులు ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఏసీబీ వలలో పంచాయతీ అధికారులు

**వేద న్యూస్, రంగారెడ్డి:**


ఇంటి నిర్మాణ అనుమతుల పేరుతో లంచం డిమాండ్ చేసి స్వీకరిస్తున్న ముగ్గురు పంచాయతీ అధికారులు తెలంగాణ అవినీతి నిరోధక శాఖ అనిశా అధికారులకు పట్టుబడ్డారు. ఏసీబీ అధికారుల వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా నందిగామ మండలంలోని ఎదులపల్లి గ్రామంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి పొన్న సుమతి, మండల పంచాయతీ అధికారి వద్యావత్ తేజ్ సింగ్, నాలుగు ప్లాట్లకు ఇంటి నిర్మాణ అనుమతులు మంజూరు చేయడానికి రూ.2 లక్షల 50 వేల లంచం డిమాండ్ చేశారు. దరఖాస్తు రుసుము ఇప్పటికే చెల్లించినప్పటికీ, అనుమతుల ప్రక్రియ పూర్తిచేయాలంటే లంచం ఇవ్వాలంటూ ఒత్తిడి చేసినట్లు అధికారులు వెల్లడించారు. ఈ క్రమంలో ఫిర్యాదుదారుని నుంచి రూ.1 లక్ష లంచం స్వీకరిస్తున్న సమయంలో అనిశా అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అనిశా స్పష్టం చేసింది. ప్రభుత్వ ఉద్యోగులు లంచం అడిగినట్లయితే ప్రజలు వెంటనే అనిశా టోల్ ఫ్రీ నెంబర్ 1064కు సమాచారం ఇవ్వాలని సూచించారు. అలాగే వాట్సాప్ నెంబర్ 9440446106, ఫేస్‌బుక్, అధికారిక వెబ్‌సైట్ ద్వారా కూడా ఫిర్యాదులు చేయవచ్చని తెలిపారు. ఫిర్యాదుదారులు, బాధితుల వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచుతామని అనిశా అధికారులు మరోసారి భరోసా ఇచ్చారు.

వేద న్యూస్
గురువారం జనవరి 08, 2026

# సొంత గూటికి మద్దుల ప్రశాంత్

- కేంద్రమంత్రి బండి సంజయ్ సమక్షంలో బిజెపిలో ప్రశాంత్ చేరిక
- పార్టీ జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో జాయిన్

**వేద న్యూస్, హుజురాబాద్:**



యువ నాయకుడు మద్దుల ప్రశాంత్ పటేల్ సొంతగూటికి చేరారు. బుధవారం ఆయన హుజురాబాద్ లో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ సమక్షంలో, పార్టీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో కాషాయ పార్టీలో చేరారు. ప్రశాంత్ కు కేంద్రమంత్రి బండి సంజయ్ స్వయంగా పార్టీలోకి ఆహ్వానించారు. కృష్ణారెడ్డి బిజెపి కండువా కప్పి యువ నాయకుడు ప్రశాంత్ ను పార్టీలోకి ఆహ్వానించారు. ప్రశాంత్ గతంలో బిజెపిలో క్రియాశీలకంగా పనిచేసిన సంగతి తెలిసిందే. కరోనా కష్టకాలంతో పాటు ఇతర సందర్భాల్లోనూ పలు సేవా కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు అండగా నిలిచిన మద్దుల ప్రశాంత్ పటేల్ బిజెపిలో చేరడంతో పలువురు సంతోషం వ్యక్తం చేశారు. బండి సంజయ్ నాయకత్వంలో క్రమశిక్షణ కలిగిన కార్యకర్తగా ముందుకు సాగుతానని, ప్రజా శ్రేయసు యే ధ్యేయంగా పనిచేస్తానని ఈ సందర్భంగా బిజెపి నాయకుడు ప్రశాంత్ వెల్లడించారు. కార్యక్రమంలో బిజెపి



కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, పార్టీ రాష్ట్ర కౌన్సిల్ నెంబర్ పుప్పాల రఘు, వీణవంక మండల అధ్యక్షులు బత్తిని నరేష్ గౌడ్, బిజెపి జిల్లా నాయకులు చెన్నమనేని నరసింహారాజు, రామిడి ఆదిరెడ్డి , గొడుగు వినోద్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# శివరాత్రిలోగా పనులు పూర్తి చేయాలి

- ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల :**




రానున్న శివరాత్రి వేడుకల నాటికి సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని రగుడు జంక్షన్ అభివృద్ధి పనులు పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మున్సిపల్ అధికారులను ఆదేశించారు. రూ.3 కోట్ల 10 లక్షల అంచనా వ్యయంతో సిరిసిల్ల మున్సిపల్ పరిధిలో రగుడు జంక్షన్‌లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను బుధవారం ఇంచార్జి కలెక్టర్ పరిశీలించారు. జంక్షన్ సుందరీకరణ, గ్రీనరీ ఏర్పాటు, డివైడర్ల నిర్మాణం, విద్యుత్ దీపాలు, హైమాస్ట్ లైట్ల ఏర్పాటు వంటి పనుల పురోగతిని ఆమె పరిశీలించారు. పనుల్లో వేగం పెంచాలని, రానున్న శివరాత్రి వేడుకలకు పూర్తిస్థాయిలో సిద్ధం చేసి జంక్షన్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని మున్సిపల్ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. పనుల నాణ్యతపై ఎలాంటి రాజీ ఉండకూడదని, నిరంతర పర్యవేక్షణతో పనులు పూర్తి చేయాలని సూచించారు. ఈ పరిశీలన కార్యక్రమంలో మున్సిపల్ డీవైఈఈ వాణి, ఏఈ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మా గ్రామాన్ని పట్టించుకోండి..

- ఏ ప్రభుత్వం వచ్చినా చిన్నచూపేనా? - రోడ్లు, డ్రైనేజీ పరిస్థితి అధ్వాన్నం
- ఓబులాపురం గ్రామస్తుల ఆవేదన




**వేద న్యూస్, ఇల్లంతకుంట :**

తమ గ్రామాన్ని ప్రభుత్వాలు చిన్నచూపు చూస్తున్నాయని, నిర్లక్ష్యంతో గ్రామ అభివృద్ధి జరగక వెనుకబడి పోతుందని రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం ఓబులాపురం గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో పదేళ్లపాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ గ్రామంలో ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టలేదని, కనీస మౌలిక సదుపాయాలకైనా నోచుకోలేదని ప్రజలు విమర్శిస్తున్నారు. ప్రభుత్వం మారితే అయినా అభివృద్ధి జరుగుతుందన్న ఆశతో ఎదురుచూసిన గ్రామస్తులకు, ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్నప్పటికీ ఓబులాపురం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టలేదని వారు అసహనం వ్యక్తం చేస్తున్నారు. గ్రామం గుండా జిల్లా కేంద్రానికి అనుసంధానంగా ఉన్న ప్రధాన రహదారి దుస్థితి మరింత సమస్యగా మారిందని ప్రజలు చెబుతున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం నుంచి ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వరకు ఈ రహదారిపై తారు లేదా బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టకపోవడం ప్రభుత్వాల నిర్లక్ష్యానికి నిదర్శనమని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా రోడ్డుకు ఇరువైపులా సైడ్ డ్రైనేజీలు కూడా లేకపోవడంతో వర్షాకాలంలో మరింత దుర్భర పరిస్థితులు నెలకొంటున్నాయని చెబుతున్నారు. ఇన్ని ఇబ్బందులు ఎదుర్కొంటున్నా గ్రామ అభివృద్ధికి ఇప్పటికీ మహర్దశ రాలేదని, ఓబులాపురం గ్రామం అభివృద్ధికి ఎందుకు నోచుకోలేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా తమ గ్రామం అభివృద్ధి చెందుతుందన్న ఆశలు నెరవేరకపోవడంతో ప్రస్తుత ప్రభుత్వంపై కూడా తీవ్ర విమర్శలు చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఓబులాపురం గ్రామంపై ప్రత్యేక దృష్టి సారించి, గ్రామ అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాలని, జిల్లా కేంద్రానికి అనుసంధానంగా ఉన్న రహదారిపై తారు రోడ్డు నిర్మించి ప్రయాణికులు, వివిధ గ్రామాల ప్రజలు, విద్యార్థులకు సురక్షిత రవాణా సదుపాయం కల్పించాలని గ్రామ ప్రజలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

# 190 జీఓను తక్షణమే అమలు పరచాలి

- పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షులు హరికృష్ణ

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**



317 జీఓ అమలుతో అనేక మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు తమ స్థానికతను కోల్పోయి సొంత గ్రామాలు, సొంత జిల్లాలను విడిచి దూర ప్రాంతా ల్లో విధులు నిర్వహించాల్సి వస్తోందని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మ్యాడారం హరికృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కారణంగా ఉద్యోగులు ఆర్థిక భారం, మానసిక ఒత్తిడి, పిల్లల బాధ్యతలు, వృద్ధ తల్లిదండ్రుల సంరక్షణ వంటి అనేక సమస్యలతో సతమవుతూ పనిచేస్తున్నారని తెలిపారు. 317 జీఓ అమలై నేటికి నాలుగేళ్లు పూర్తయినప్పటికీ, ఈ నాలుగేళ్లుగా విజ్ఞప్తులు, నిరసనలు, వినతిపత్రాలు, ధర్నాలు నిర్వహించినా ఆశించిన స్థాయిలో ఉపశమన చర్యలు లభించలేదని పేర్కొన్నారు. ఈ అంశంపై ఏర్పాటు చేసిన కేబినెట్ సబ్ కమిటీ సిఫారసుల మేరకు విడుదలైన 190 జీఓకు ఇప్పటికే నాలుగు నెలలు పూర్తయ్యాయని, అర్హులైన ఉద్యోగులు, ఉపాధ్యాయులు దరఖాస్తులు చేసుకున్నప్పటికీ ఇప్పటివరకు అమలు జరగలేదని ఆందోళన వ్యక్తం చేశారు. అందువల్ల వెంటనే 190 జీఓను అమలు చేసి, ఉద్యోగులు, ఉపాధ్యాయులకు తాత్కాలిక డెప్యూటేషన్‌లు కల్పించాలని డిమాండ్ చేశారు. అవసరమైతే సూపర్ న్యూమరీ పోస్టులను సృష్టించి, అందరికీ న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో పీఆర్‌టీయూ ప్రధాన కార్యదర్శి_. హరేందర్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి. సత్యనారాయణతో పాటు శిరోమణి, సరోజ, ఎస్. రమేష్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

# సీఎం సోదరుడు కొండల్ రెడ్డికి సిట్ నోటీసులు

- ఇద్దరు బీఆర్ఎస్ నేతలనూ విచారణకు పిలుపు
- రేపు ఉదయం 11 గంటలకు హాజరు కావాలని ఆదేశాలు
- తెలంగాణ ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక మలుపు

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి:**



తెలంగాణ ఫోన్ ట్యాపింగ్ కేసులో కొత్త పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఈ కేసులో సీఎం రేవంత్ రెడ్డి సోదరుడు కొండల్ రెడ్డికి స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ నోటీసులు జారీ చేసింది. రేపు ఉదయం 11 గంటలకు విచారణకు హాజరుకావాలని నోటీసులో పేర్కొంది. దర్యాప్తులో భాగంగా, రేవంత్ రెడ్డి విపక్ష నాయకుడిగా ఉన్న సమయంలో కొండల్ రెడ్డి ఫోన్‌ను ట్యాప్ చేసినట్లు ఆధారాలు లభించాయని సమాచారం. ఈ నేపథ్యంలో ఆయన వాంగ్మూలం నమోదు చేసుకునేందుకు విచారణకు పిలిచినట్లు అధికారులు తెలిపారు. ఇదే కేసులో మరో ఇద్దరు బీఆర్ఎస్ నేతలకు కూడా ఎస్ఐటీ నోటీసులు పంపింది. మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, చిరుమర్తి లింగయ్యలను కూడా రేపు ఉదయం 11 గంటలకు హాజరు కావాలని ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటికే ఈ కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ నవీన్ రావు తండ్రి కొండలరావు, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కుమారుడు సందీప్ రావులకు కూడా ఇలాంటి నోటీసులు అందినట్లు అధికారులు వెల్లడించారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై ఎస్ఐటీ దర్యాప్తు కొనసాగుతోందని, సంబంధితులందరి వాంగ్మూలాల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటా మని స్పష్టం చేశారు.

# అక్రమ ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ పట్టివేత

**వేద న్యూస్, వేములవాడ**




వేములవాడ పట్టణ పరిధిలోని మూలవాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను వేములవాడ మండల రెవెన్యూ అధికారులు బుధవారం పట్టుకు న్నారు. పట్టణంలో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనుల కోసం వారానికి మూడు రోజుల పాటు పరిమిత స్థాయిలో ఇసుక తరలింపునకు రెవెన్యూ అధికారులు అనుమతులు ఇస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో బుధవారం టీఎస్ 21 టీ 6328 నంబర్ కలిగిన ట్రాక్టర్ అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్న అధికారులు, తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. ఈ ఘటనపై తహసీల్దార్ విజయ ప్రకాష్ రావు ను వివరణ కోరగా, సంబంధిత ట్రాక్టర్ యజమాని ముందస్తు అనుమతులు లేకుండా, అనుమతించిన సమయానికి ముందే ట్రాక్టర్లో ఇసుక నింపుకుని అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించి పట్టుకున్నామని తెలిపారు. అక్రమ ఇసుక తరలింపుపై కఠిన చర్యలు కొనసాగుతాయని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని రెవెన్యూ అధికారులు హెచ్చరించారు.

# ఆర్టిఐ2026 క్యాలెండర్ ఆవిష్కరణ




**వేద న్యూస్, హుజురాబాద్:**

హుజురాబాద్ పట్టణ పరిధిలోని పోలీస్ స్టేషన్ నందు సిఐ కరుణాకర్ చేతుల మీదుగా ఆర్టిఐ క్యాలెండర్ ఆవిష్కరణ చేశారు. సందర్భంగా ఆర్టిఐ తెలంగాణ జాయింట్ సెక్రటరీ దొడ్డే రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ.. సామాన్యులకు ఆర్టిఐ సమా చార హక్కు చట్టం కార్యకర్తలు ప్రజల పట్ల నిష్పక్షపాతంగా పని చేస్తారని, ఆర్టిఐ కార్యకర్తలు ప్రజలతో ఒక సామాన్యులుగా వ్యవహరిస్తూ ప్రజల సమస్యల కోసం కృషి చేస్తారని అన్నారు. ఆంధ్రప్రదేశ్ తెలంగాణ ఉభయ తెలుగు రాష్ట్రాల నందు ప్రజలకు ఆర్టిఐ వారు అందుబాటులో ఉంటారని సమాచార హక్కు చట్టం ఎటువంటి సమస్యకైనా పరిష్కారం దిశగా కృషి చేస్తుందని వారన్నారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ పట్టణ సిఐ మాట్లాడుతూ ఆర్టిఐ క్యాలెండర్ను ఆవిష్కరించడం చాలా ఆనందంగా ఉందని అన్నారు, ఆర్ టి ఐ ప్రజల సమస్యలను వెలుగులోకి తెస్తూ ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా నిలుస్తుందన్నారు. భవిష్యత్తులోనూ ఈ ఒరవడి కొనసాగించాలని ఆకాంక్షంచారు. అనంతరం జమ్మికుంట పట్టణ పరిధిలోని స్థానిక పోలీస్ స్టేషన్ నందు జమ్మికుంట పట్టణ సిఐ రామకృష్ణ, ఎస్సై నాగరాజు ఆర్టిఐ క్యాలెండర్ ఆవిష్కరణ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆర్టిఐ సభ్యులందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ టి ఐ తెలంగాణ స్టేట్ జాయింట్ స్కెట్రరీ దొడ్డే రాజేంద్రపసాద్, హుజురాబాద్ సిఐ కరుణాకర్, ఆర్.టి.ఐ జిల్లా అధ్యక్షులు దొడ్డే శ్రీకాంత్, జమ్మికుంట పట్టణ సిఐ రామకృష్ణ ,ఎస్సై నాగరాజు, రాధాకృష్ణ, రాజేశ్వరరావు, సలీం తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రతపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి

**వేద న్యూస్, అల్లాదుర్గ్:**

- మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్




రోడ్డు నిబంధనలను పాటిస్తూ ప్రమాదాలను అరికట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్ అన్నారు. రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా బుధవారం అల్లాదుర్గ్ మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులను ఉద్దేశించి ఆయన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలతో పాటు, సైబర్ క్రైమ్‌లో ప్రజలు ఎలా మోసపోతున్నారో, వాటి నుంచి ఎలా జాగ్రత్తపడాలో విద్యార్థులకు వివరించారు. ద్విచక్ర వాహనాలు నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్లు నడిపేటప్పుడు సీట్‌బెల్ట్ వినియోగించాల్సిన అవసరం ఉందని చెప్పారు. మద్యం సేవించి వాహనాలు నడపకూడదని, ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, వాహనాలకు ఇన్సూరెన్స్ తప్పనిసరిగా ఉండాలని సూచించారు.

# సైబర్ నేరాల పట్ల జాగ్రత్త

- అనుమానాస్పద లింకులు ఓపెన్ చేయొద్దు
- ఇబ్రహీంపట్నం ఎస్ఐ అనిల్
- సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు

**వేద న్యూస్, ఇబ్రహీంపట్నం:**




నేటి కాలంలో యువత, విద్యార్థులు డిజిటల్ ప్రపంచంలో ఎక్కువ సమయం గడుపుతున్న నేపథ్యంలో సైబర్ నేరాలు పెరుగుతున్నాయని, ఆన్‌లైన్ మోసాలు, సోషల్ మీడియాలోని నకిలీ అకౌంట్లు, అనుమానాస్పద లింకుల నుంచి జాగ్రత్తగా ఉండాలని ఇబ్రహీంపట్నం ఎస్ఐ అనిల్ చెప్పారు. మండల కేంద్రంలోని కస్తూర్బా విద్యార్థులకు సైబర్ నేరాలు, డ్రగ్స్, ట్రాఫికింగ్, ఉమెన్ ట్రాఫికింగ్ వంటి అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ అనిల్ మాట్లాడుతూ.. డ్రగ్స్, గంజాయి వినియోగం యువత భవిష్యత్తును నాశనం చేసే ప్రమాదకరమైన సామాజిక సమస్యగా మారిందని హెచ్చరించారు. ఇవి ఆరోగ్యానికే కాకుండా జీవిత లక్ష్యాలను కూడా దెబ్బతీస్తాయని వివరించారు. రోడ్లపై ప్రయాణించే సమయంలో ట్రాఫిక్ నిబంధనలు పాటించడం, హెల్మెట్, సీటుబెల్ట్ వినియోగం, వేగ నియంత్రణ వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఉమెన్ ట్రాఫికింగ్ వంటి నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, పరిచయం లేని వ్యక్తులను నమ్మడం వల్ల ఎదురయ్యే ప్రమాదాలను కూడా విద్యార్థులకు వివరించారు.

వేద న్యూస్

గురువారం జనవరి 08, 2026

## యాచకులకు దుప్పట్లు, భోజనం అందజేత

**వేద న్యూస్, రుద్రూర్:**




రుద్రూర్ మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, లయన్స్ క్లబ్ సభ్యుడు గాండ్ల మధు కూతురు ఆనందిత శ్రీ పుట్టినరోజు సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బోధన్ పట్టణంలోని బస్టాండ్ ప్రాంతం, రాకాసిపేటలోని రైల్వే స్టేషన్ పరిసరాల్లో నివసిస్తున్న అనాథ యాచకులను సందర్శించి, వారికి నాణ్యమైన దుప్పట్లు, భోజనాన్ని అందజేశారు. అదేవిధంగా రుద్రూర్ మండల కేంద్రంలోని శ్రీ దేవిదాస్ రావు గోశాలలో గోవులకు దాన కార్యక్రమం నిర్వహించి, సేవాభావాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమాలు పేదలు, నిరా శ్రయులకు ఉపశమనంగా నిలిచాయని పాల్గొన్నవారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు లయన్ శ్యాంసుందర్ పహాడే, కార్యవర్గ సభ్యులు లయన్ పార్వతి ప్రశాంత్, లయన్స్ క్లబ్ ఆఫ్ ఆచంపల్లి డైనమిక్ కార్యదర్శి లయన్ కోట్న గంగా శేఖర్, సాయికిరణ్, దంత వైద్యులు డాక్టర్ ఇర్ఫాన్ అలీతో పాటు పలువురు లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

## బెదిరింపులకు పాల్పడుతున్న నలుగురి అరెస్ట్

- 9 ఎంఎం పిస్టల్, 5 రౌండ్లు బుల్లెట్లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ మహేష్ బి. గితే

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**



జనశక్తి కార్యకలాపాల పేరుతో బెదిరింపులకు పాల్పడి, డబ్బు వసూలు చేయాలని ప్రయత్నిస్తున్న నలుగురు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేసినట్లు జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే వెల్లడించారు. తంగళ్లపల్లి గ్రామ శివారులో వాహనాల తనిఖీలు నిర్వహించగా, అనుమానాస్పదంగా కనిపించిన నలుగురిని తనిఖీ చేయగా వారి వద్ద ఒక 9 ఎంఎం పిస్టల్, ఐదు రౌండ్లు లభ్యమయ్యాయని తెలిపారు. ఆయుధాలను స్వాధీనం చేసుకుని నిందితులను అరెస్ట్ చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు చెప్పారు. అరెస్టైన వారిలో రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన తోకల శ్రీకాంత్, దాసరి తిరుపతి, పయ్యావుల గోవర్ధన్, జగిత్యాల జిల్లాకు చెందిన వంజరి సురేందర్ ఉన్నట్లు ఎస్పీ తెలిపారు. వీరు ముఠాగా ఏర్పడి బెదిరింపులు, అక్రమ కార్యకలాపాలకు పాల్పడేందుకు ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. ప్రజలను భయభ్రాంతులకు గురిచేసే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని, చట్టవిరుద్ధ కార్యకలాపాల్లో పాల్గొనేవారిపై కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ హెచ్చరించారు. ఈ ఆపరేషన్‌లో సిరిసిల్ల రూరల్ సీఐ మొగిలి, టాస్క్‌ఫోర్స్ సీఐ నటేష్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రవి, ఎస్ఐ ఉపేంద్రచారి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## గణేష్‌కు వివేకానంద నేషనల్ ఇన్స్పిరేషన్ అవార్డు

**వేద న్యూస్, శాయంపేట :**



హనుమకొండ జిల్లా శాయంపేట మండలం పత్తిపాక గ్రామానికి చెందిన కందగట్ల గణేష్ కు వివేకానంద నేషనల్ ఇన్స్పిరేషన్-2026 అవార్డు లభించింది. గత మూడు దశాబ్దాలుగా ఆంగ్ల బోధనతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలు, ప్రేరణాత్మక ఉపన్యాసాల ద్వారా విద్యార్థులకు విద్యతో పాటు జీవన విలువలను బోధిస్తూ ఆదర్శంగా నిలిచినందుకు ఈ అవార్డును ప్రకటించినట్లు నిర్వాహకులు తెలిపారు. తమిళనాడు రాష్ట్రానికి చెందిన ఇండియన్ ఫోరం ఈ అవార్డును ప్రకటించగా, కందగట్ల గణేష్ ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న వెల్దిలోని ఆదర్శ పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాలకుర్తి శ్రీధర్ చేతుల మీదుగా అవార్డును స్వీకరించారు. గతంలో కూడా గణేష్ పలు ప్రతిష్టాత్మక అవార్డులు అందుకున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా కందగట్ల గణేష్ మాట్లాడుతూ, ఈ అవార్డు తనపై మరింత బాధ్యతను పెంచిందని తెలిపారు. ఎల్లప్పుడూ తనకు ప్రోత్సాహం అందిస్తున్న ప్రధానోపాధ్యాయులు, సహచర ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు

## పేద ప్రజలకు వరం బీసీఎం ట్రస్ట్

- రామన్నపేట సర్పంచ్ కవిత వెంకటరెడ్డి

**వేద న్యూస్, బోయినిపల్లి:**



గ్రామీణ పేద ప్రజలకు కొదురుపాక బీసీఎం ట్రస్ట్ ఒక వరం లాంటిదని రామన్నపేట సర్పంచ్ చింతలపల్లి కవిత వెంకటరెడ్డి అన్నారు. బుధవారం కొదురుపాక బీసీఎం ట్రస్ట్, కంటి దవాఖాన ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్యాలయంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని సర్పంచ్ ప్రారంభించారు. ఈ ఉచిత కంటి వైద్య శిబిరంలో సుమారు 150 మందికి ఉచిత కంటి పరీక్షలు నిర్వహించగా, మరికొందరిని కంటి ఆపరేషన్లకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కొదురుపాక బీసీఎం కంటి ఆస్పత్రి నిర్వాహకులు, ప్రముఖ కంటి వైద్య నిపుణులు డా. వైరాగ్యం రాజలింగం, డా. రీటా బహదూర్ షా దంపతులు మారుమూల గ్రామీణ ప్రాంతంలో కూడా అధునాతన సౌకర్యాలతో, కార్పొరేట్ ఆస్పత్రులకు మించిన స్థాయిలో కంటి దవాఖాన ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. గత మూడు సంవత్సరాల్లో 56 గ్రామాల్లో ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహించి, 10 వేల మందికి పైగా కంటి పరీక్షలు చేసినట్లు తెలిపారు. అలాగే 2,150 మందికి పైగా కంటి ఆపరేషన్లు విజయవంతంగా నిర్వహించారని చెప్పారు. ఈ కంటి దవాఖాన గ్రామీణ పేద ప్రజలకు ఎంతో ఉపయోగపడుతోందని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కంటి వైద్య నిపుణురాలు డా. రీటా బహదూర్ షా, డ్యూటీ డాక్టర్ రాజేంద్రనాథ్, ఉప సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, వార్డు సభ్యులు, సీనియర్ నాయకులు చింతలపల్లి వెంకటరెడ్డి, కలంపల్లి రాములు, మాజీ సర్పంచులు తదితరులు పాల్గొన్నారు

## మరణానంతరం గౌరవంగా సాగనంపాలి

- అంత్యక్రియలకు సదుపాయాలు కల్పిస్తున్నాం
- రూ.50 లక్షల వ్యయంతో హిందూ శ్మశానవాటిక నిర్మాణం
- మంత్రి వివేక్ వెంకటస్వామి

**వేద న్యూస్, క్యాతనపల్లి:**

ప్రతి వ్యక్తిని మరణానంతరం గౌరవంగా అంత్యక్రియలు నిర్వహించేందుకు సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. మంచిర్యాల జిల్లా క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఆర్‌ఆర్ నగర్‌లో హిందూ శ్మశానవాటిక నిర్మాణ పనులకు మంత్రి బుధవారం శంకుస్థాపన చేశారు. పలు అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా, 15వ పట్టణ ప్రగతి ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.50 లక్షల వ్యయంతో చేపట్టనున్న శ్మశాన వాటిక, అంతర్గత రహదారి నిర్మాణం, డ్రెస్సింగ్ రూమ్ పనులకు శంకుస్థాపన నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రజల సౌకర్యార్థం రూ.50 లక్షల వ్యయంతో హిందూ శ్మశాన వాటికను ఏర్పాటు చేస్తున్నామని, అవసరమైతే అదనంగా రూ.20 లక్షల నిధులు కూడా మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. స్మశాన వాటికలో లైటింగ్, అంతర్గత రహదారులు సహా అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తామని స్పష్టం చేశారు. అనంతరం మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ .. రూ.50 లక్షల అంచనా వ్యయంతో



చేపట్టిన హిందూ స్మశాన వాటిక పనులను రెండు నెలల లోపు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. మున్సిపల్ పరిధిలో ప్రజల సౌకర్యార్థం లైటింగ్ కోసం మంజూరు చేసిన వాహనాన్ని సమర్థంగా వినియోగించుకోవాలని, అన్ని వార్డులు, పబ్లిక్ ప్రాంతాల్లో సోలార్ లైటింగ్ వ్యవస్థ ఏర్పాటు చేయాలని సూచించారు. మున్సిపాలిటీ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేసి, ప్రజా సమస్యలను అధికారుల సమన్వయంతో పరిష్కరిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై కఠిన చర్యలు

- రోడ్ సేఫ్టీ, సైబర్ క్రైమ్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలి
- ఎస్పీ డీవీ శ్రీనివాస రావు
- పెద్ద శంకరంపేట్-ఏ పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ

**వేద న్యూస్, మెదక్:**

రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరిస్తూ క్రమబద్ధంగా నిర్వహించాలని, అసాంఘిక కార్యకలాపాలకు అవకాశం లేకుండా కట్టుదిట్టమైన పర్యవేక్షణ చేపట్టాలని మెదక్ జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అన్నారు. శంకరంపేట్ ఏ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ ఆవరణలోని వాహనాలు, కేసు రికార్డులు, పెండింగ్ కేసుల వివరాలను పరిశీలించి సిబ్బందికి కేటాయించిన పరికరాలు, స్టేషన్ రికార్డులను సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రజలకు సైబర్ క్రైమ్, రోడ్ సేఫ్టీ, మహిళల భద్రత, షీ టీం సేవలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. కేసుల దర్యాప్తులో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి వేగంగా, నాణ్యతతో విచారణలు చేపట్టి బాధితులకు సకాలంలో న్యాయం జరిగేలా కృషి చేయాలని తెలిపారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు డ్రంక్ అండ్ డ్రైవ్, ఓపెన్ డ్రింక్‌పై ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని సూచించారు. విధుల నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బందికి నగదు రివార్డులు, ప్రశంసాపత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు. అలాగే సిబ్బంది పిల్లల చదువుల విషయమై కూడా వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ తనిఖీలో ఎస్పీ ఇన్‌స్పెక్టర్ సందీప్ రెడ్డి, ఎస్ఐ ప్రవీణ్ రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.




## సమస్యల పరిష్కారానికి క్షేత్రస్థాయి పర్యవేక్షణ

- సర్పంచ్ సిడం రాందాస్

**వేద న్యూస్, కాసిపేట:**



దేవాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని పెద్దాపూర్ కొలంగూడ ప్రాంతంలో గ్రామంలో నెలకొన్న వివిధ సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు గ్రామ సర్పంచ్ సిడం రాందాస్ వార్డు మెంబర్లతో కలిసి క్షేత్రస్థాయి పర్యవేక్షణ చేపట్టారు. ఈ సందర్భంగా తాగు నీరు, డ్రైనేజీ, రహదారులు, పారిశుధ్య సమస్యలు తదితర అంశాలను సర్పంచ్ పరిశీ లించారు. స్థానిక ప్రజలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గుర్తించిన సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీస్తుళ్లి, త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని సర్పంచ్ తెలిపారు. గ్రామాభివృద్ధే లక్ష్యంగా నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తామని, ప్రజల సమస్యలకు ప్రాధాన్యత ఇస్తామని సిడం రాందాస్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు, గ్రామ పెద్దలు, స్థానికులు పాల్గొన్నారు.

## కస్తూర్బా విద్యాలయాన్ని తనిఖీ చేసిన ప్రత్యేక అధికారి

**వేద న్యూస్, దామరచర్ల:**



దామరచర్ల మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని మండల స్పెషల్ ఆఫీసర్ పత్యానాయక్ బుధవారం తనిఖీ చేశారు. పాఠశాలలో మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందిస్తున్నారా లేదా అనే అంశాన్ని పరిశీలించారు. అనంతరం స్టోర్ రూమ్‌ను సందర్శించి, బియ్యం, కూరగాయలు తదితర సరుకుల నిల్వలో తగు జాగ్రత్తలు పాటించాలని అధికారులకు సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం, పరిశుభ్ర వాతావరణం కల్పించాలని ఆదేశించారు. ఈ తనిఖీలో మండల విద్యాధికారి సైదానాయక్, మండల అభివృద్ధి అధికారి అలివేలు మంగ, ఏఎస్వో కవిత తదితరులు పాల్గొన్నారు.

## మన వార్త పత్రిక క్యాలండర్ ను ఆవిష్కరించిన కేంద్ర మంత్రి సంజయ్

**వేద న్యూస్ ,జమ్మికుంట:**




మన వార్త దినపత్రిక క్యాలండర్ ను కేంద్ర సహాయ మంత్రి ఆవిష్కరించారు. మన వార్త దినపత్రిక కు సంబంధించిన నూతనసంవత్సర 2026 క్యాలండర్ ను కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ చేతుల మీదుగా జమ్మికుంట లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అధికారులకు వారధిగా పనిచేసేది పత్రిక అని అన్నారు.సమాజంలో వార్త సమాచారాన్ని ప్రజలకు ఉన్నది ఉన్నట్లు గా అందిస్తూ,నిరంతరం ప్రజా సమస్యలపై పోరాటం చేస్తూ అనతికాలంలోనే విస్తృత ప్రాచుర్యం పొందిన మన వార్త దినపత్రికకు వారి యాజమాన్యానికి సిబ్బందికి శుభాకాంక్షలు,అభినందనలు తెలిపారు.రానున్న రోజుల్లో క్షత్ర స్థాయిలో మరింతగా ప్రజల సమస్యలను ప్రభుత్వ ప్రజాప్రతినిధులకు తెలియజేసి పరిష్కార దిశగా పనిచేయాలని అన్నారు. ఈ కార్యక్రమములో పత్రిక యాజమాన్యం సీ ఈ ఓ ఎడిటర్ భూపతి సంతోష్,డైరెక్టర్ యెబుషి సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల పొలం బాట

- వ్యవసాయంపై ప్రత్యక్ష అవగాహన

**వేద న్యూస్, మందమర్రి టౌన్:**



ఆహార ఉత్పత్తులను పండించేందుకు రైతులు పడే కష్టం, శ్రమను ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు పాఠశాల విద్యార్థులు పొలం బాట పట్టారు. బుధవారం మందమర్రి పట్టణంలోని శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులకు వ్యవసాయంపై అవగాహన కల్పించే ఉద్దేశంతో 'పొలం బాట' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ రమేష్ మాట్లాడుతూ, రైతులు దేశానికి వెన్నెముకలాంటివారని, చిన్నతనంలోనే విద్యార్థులకు వ్యవసాయ రంగ ప్రాధాన్యతను తెలియజేయాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. విద్యార్థులకు వరి నాటడం, పంట కోత వంటి వ్యవసాయ కార్యకలాపాలపై ప్రత్యక్ష అవగాహన కల్పించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ శ్రీ విద్య, చైర్మన్ మల్లంపల్లి శ్రీధర్, ఏజీఎం అరవింద్ రెడ్డి, కోఆర్డినేటర్ నాగరాజు, పాఠశాల డీన్ రవి, ఇన్‌చార్జిలు నూకల సునీత, తిరుమలతో పాటు ఉపాధ్యాయులు హై ఎస్పీ బా, సునీత, మంగాదేవి, లావణ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

## సామూహిక సీమంతాలు

**వేద న్యూస్, రుద్రూర్:**



రుద్రూర్ మండల కేంద్రంలోని జేయన్సీ కాలనీలో గల అంగన్వాడీ సెంటర్ 8లో గర్భిణులు, బాలింతలకు సామూహిక సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన్న కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం వార్డు మెంబర్ వడ్ల అమృతకు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్ వడ్ల అమృత, అంగన్వాడీ టీచర్ పద్మ, ఆశా వర్కర్, చిన్నారుల తల్లులు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

## సెల్ ఫోన్ డ్రైవింగ్ వల్లే ప్రమాదాలు ఎస్సై

**వేద న్యూస్, చొప్పదండి/రామడుగు:**



బండి నడిపే వ్యక్తికి సహనం, నేర్పరితనం ఉన్నప్పుడే ఆ ప్రయాణం సుఖవంతంగా గమ్యస్థానం చేరుతుందని ఎస్ఐ రాజు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని ఆటో డ్రైవర్లతో రోడ్డు ప్రమాదాల నివారణపై మాట్లాడుతూ.. మద్యం సేవించి, ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం వల్ల ఎక్కువ ప్రమాదాలు జరుగుతాయన్నారు. ప్రయాణానికి ముందే వాహనాన్ని అన్ని విధాలుగా పరీక్ష చేసుకున్నాకే ప్రయాణికులను ఎక్కించుకోవాలని సూచన చేశారు. వాహనం ముందు భాగంలో రేడియం అతికించాలని ఈ సందర్భంగా వారికి వివరించారు.

వేద న్యూస్

గురువారం జనవరి 08, 2026

# హుజురాబాద్ లో చిచ్చు రేపుతున్న డంపింగ్ యార్డ్?

- త్వరలో మున్సిపల్ మంత్రితో ములాఖత్!
- స్పందన రాకపోతే హైకోర్టును ఆశ్రయిస్తాం : సబ్బని వెంకట్ వెల్లడి
- సబ్బని వ్యూహంలో చిక్కుకున్న రాజకీయపక్షలు?

**వేద న్యూస్, హుజురాబాద్:**



హుజురాబాద్ ప్రాంతంలో ఏర్పాటు చేయతలపెట్టిన డంపింగ్ యార్డ్ విషయం ప్రస్తుతం తీవ్ర చర్చనీయాంశంగా తయారైంది. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృతంలో గల గత బీఆర్ఎస్ ప్రభుత్వం చివరి రోజులలో డంపింగ్ యార్డ్ను మంజూరు చేస్తూ జారీ చేసిన జీవోను రద్దు చేయడానికి రెండు సంవత్సరాలు కావస్తున్నప్పటికీ.. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పట్ల ప్రజల నుండి తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అవుతున్నది. ఇదే విషయమై ప్రముఖ సామాజికవేత్త.. రాజకీయ విశ్లేషకులైన సబ్బని వెంకట్ దృష్టికి ఈ అంశాన్ని తీసుకువెళ్లి ఏర్పాటు కాకుండా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరుతూ ప్రజలు ఆయనకు పెద్ద ఎత్తున వినతి పత్రాలు సమర్పిస్తున్నారు. దీంతో గత కొంతకాలంగా వివిధ మాధ్యమాల ద్వారా చిన్న పిల్లలకు.. వ్యవసాయదారులకు.. పంట పొలాలకు డంపింగ్ యార్డ్ వల్ల ఏర్పడే ప్రమాదం గురించి తరచుగా సబ్బని వెంకట్ తన అభిప్రాయాలను కొంతకాలంగా వెల్లడిస్తూ వస్తున్నారు.

**కోదండరాంతో పర్యటన**

ఈ క్రమంలో మొన్నటి ఆదివారం తెలంగాణ జన సమితి నాయకులు ప్రొఫెసర్ కోదండరాం హుజురాబాద్ పర్యటనకు విచ్చేయడం.. ఇదే మంచి అవకాశం గా భావించి తన నివాసానికి భోజనం చేయడానికి రావలసిందిగా వెంకట్ ఆహ్వానించడంతో కోదండరాం సిరసపల్లిలోని వెంకట్ ఇంటికి వెళ్లడం జరిగింది. విలేకరుల.. గ్రామస్తుల.. మేధావుల సమక్షంలో ఈ ప్రాంతంలో ప్రభుత్వం ఏర్పాటు చేయ తలపెట్టిన డంపింగ్ యార్డ్ వల్ల ఉత్పన్నమయ్యే భయానక పరిస్థితుల గురించి సబ్బని వెంకట్ ప్రొఫెసర్ కోదండరాం దృష్టికి అన్ని విషయాలను తీస్తుళ్లారు. డంపింగ్ యార్డుల ఏర్పాటు వల్ల తలెత్తే పరిణామాల గురించి తనకు తెలుసునని.. వీటివల్ల భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందని.. ఈ ప్రాంత ప్రజల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని మీరు చేసే ఉద్యమానికి సంపూర్ణ సహకారం అందిస్తానని.. అవసరమైతే మనమందరం కలిసి ముఖ్యమంత్రి దృష్టికి ఈ విషయాన్ని తీసుకువెళ్లడానికి సహకరిస్తానని కోదండరాం ప్రకటించడం సబ్బని వెంకట్ ప్రారంభించిన ఉద్యమానికి బలం చేకూరినట్లయింది. ప్రొఫెసర్ కోదండరాం.. సబ్బని వెంకట్ సంయుక్తంగా ప్రెస్ నోట్ విడుదల చేసిన కొన్ని గంటలలోనే శాసన మండలి వేదికగా ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ ఇదే డంపింగ్ యార్డ్ విషయమై ప్రస్తావన చేసి హుజురాబాద్ ప్రాంతంలో దీనిని ఏర్పాటు చేయకుండా ప్రభుత్వ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేయక తప్పని పరిస్థితి ఏర్పడింది. వివిధ మాధ్యమాల ద్వారా కొంతకాలంగా సబ్బని స్పందిస్తున్నప్పటికీ హుజురాబాద్ ప్రాంతానికి చెందిన ఏ రాజకీయ పార్టీ నాయకుడు ప్రజలపక్షన నోరు విప్పకపోవడం వంటి పరిణామాలను ప్రజలు మొన్నటి వరకు గమనిస్తూ వచ్చారు. సిరసపల్లి వేదికగా ఎప్పుడైతే ఈ అంశం కోదండరాం దృష్టికి వెంకట్ తీసుకువెళ్లడం.. అవసరమైతే అఖిలపక్షం ఏర్పాటు చేస్తామని.. త్వరలోనే మున్సిపల్ శాఖ మంత్రిని కలుస్తామని.. ప్రభుత్వం స్పందించకపోతే కొంత సమయం ఎదురుచూసి ప్రజల పక్షన పోరాడాలని నిర్ణయించి హైకోర్టును కూడా ఆశ్రయిస్తామని వెంకట్ పరోక్షంగా "సిగ్నల్సుఇవ్వడంతో రాజకీయ పార్టీలలో కదలిక మొదలైంది. తాము కూడా ఈ విషయంలో స్పందించకపోతే ప్రజల నుండి విమర్శలు ఎదురవుతాయని వారు భావించడం వల్లనే తాజాగా ఈ ఉదంతం సిరసపల్లిని దాటి శాసనమండలి వేదికగా ఈ అంశం చర్చకు దారితీయడం



వెంకట్ "ద్రిటు గానే చెప్పుకోక తప్పదు. వేరే జిల్లాలో గల వేరే ప్రాంతంలో నిర్మించ తలపెట్టిన ఈ డంపింగ్ యార్డ్ ను వ్యతిరేకిస్తూ ప్రజలు ఉద్యమాలు చేయడానికి శ్రీకారం చుట్టడం.. ఇది గమనించిన అక్కడి రాజకీయ పక్షలు రాజకీయాలకు అతీతంగా అందరూ సంఘటితమై ప్రజలకు మద్దతు తెలపడం తెలిసిన విషయమే. ఆ ప్రాంత రాజకీయ నేతల మాదిరిగా హుజురాబాద్ ప్రాంత నాయకులు ప్రజల కోసం సంఘటితం కాకపోవడం విస్మయం కలిగిస్తోంది. డంపింగ్ యార్డు ఏర్పాటు వల్ల వాతావరణంలో పేను మార్పులు సంభవించడం.. పసిపిల్లలలో.. విద్యార్థులలో శ్వాస సంబంధించిన ఇబ్బందులు ఏర్పడి పరిస్థితులు క్యాన్సర్ వచ్చేవరకు దాపురించడం... మరణాల సంఖ్య ఊహించని విధంగా పెరగడం.. త్రాగు సాగునీరు విషతుల్యంగా మారడం.. పచ్చని పంట పొలాలు బీళ్లుగా మారడం వంటి దారుణమైన పరిణామాలు సంభవిస్తాయని తెలిసి కూడా ప్రజల కోసం నాయకులు పోరాడకపోవడం విమర్శలకు దారితీస్తోంది. ఏది ఏమైనా తనతో కలిసి వచ్చే ప్రతి ఒక్కరితో చేయి కలిపి ప్రజల పక్షన హుజురాబాద్ ప్రాంతంలో ఈ డంపింగ్ యార్డ్ ఏర్పాటు కాకుండా చివరి నిమిషం వరకు పోరాడుతానని బుధవారం సాయంత్రం సబ్బని వెంకట్ మీడియాతో పేర్కొన్నారు.

# 'ఎకో టూరిజం' అభివృద్ధికి శ్రీకారం

- ఖమ్మం జిల్లా పులి గుండాల అటవీ ప్రాంతంలో..

**వేద న్యూస్, ఖమ్మం:**




ఖమ్మం జిల్లాలోని సహజ సిద్ధమైన అడవి అందాలకు నిలయమైన పులి గుండాల అటవీ ప్రాంతాన్ని ఒక అద్భుతమైన పర్యాటక కేంద్రంగా తీర్చి దిద్దేందుకు జిల్లా అటవీ శాఖ అధికారులు సన్నాహాలు మొదలు పెట్టారు. సత్తుపల్లి డివిజన్, తల్లాడ రేంజ్ పరిధిలో ఉన్న ఈ ప్రాంతాన్ని ఎకో టూరిజం దిశగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.ఈ సందర్భంగా జిల్లా అటవీశాఖ అధికారి సిద్ధార్థ్ విక్రమ్ సింగ్ కి ఓరుగల్లు వైల్డ్ లైఫ్ సొసైటీ ప్రత్యేక కలిసి ఎకో టూరిజం గురించి వివరించారు. పులి గుండాల అటవీ ప్రాంతం తన ప్రకృతి సౌందర్యంతో పర్యాటకులను ఆకట్టుకుంటోంది. దీన్ని మరింత చేరువ చేసేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలను అటవీ శాఖ కల్పించనుంది. అడవికి ఎలాంటి హాని కలగకుండా, ప్రకృతి సిద్ధమైన వాతావరణంలో పర్యాటకులు సమయం గడిపేలా ఈ ఎకో టూరిజం ప్రాజెక్టును రూపొందిస్తున్నారు.

**సదుపాయాల కల్పన:** పర్యాటకుల సందర్శనార్థం వ్యూ పాయింట్లు, నడక దారులు, అవసరమైన ప్రాథమిక వసతులను ఏర్పాటు చేయనున్నారు.

**స్థానిక ఉపాధి:** ఈ ప్రాజెక్ట్ ద్వారా స్థానిక గిరిజనులకు మరియు అటవీ ప్రాంత ప్రజలకు గైడ్లుగా, ఇతర సేవల ద్వారా ఉపాధి అవకాశాలు లభించే అవకాశం ఉంది.ఈ సందర్భంగా జిల్లా అటవీ శాఖ అధికారులు మాట్లాడుతూ.. "పులి గుండాల ప్రాంతానికి ఉన్న పర్యాటక అవకాశాలను గుర్తించి, పర్యావరణాన్ని కాపాడుతూనే పర్యాటకులను ఆకర్షించేలా తగిన చర్యలు తీసుకుంటున్నాము. త్వరలోనే పనులు ప్రారంభించి సందర్శకులకు అందుబాటులోకి తీసుకువస్తాము" అని తెలిపారు.ప్రకృతి ఒడిలో ప్రశాంతంగా గడపాలనుకునే పర్యాటకులకు పులి గుండాల రాబోయే రోజుల్లో ఒక ప్రధాన గమ్యస్థానంగా మారుతుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ సందర్భన కార్యక్రమంలో ఓరుగల్లు వైల్డ్ లైఫ్ సొసైటీ అధ్యక్షులు ఇందారం నాగేశ్వర్ రావు,కార్యదర్శి చెలుపూరి శ్యామ్ సుందర్ శర్మ , జాయింట్ సెక్రటరీ పిట్టల రవిబాబు అటవి శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆదివాసీ యువత క్రీడా ప్రతిభకు

# వేదిక మెగా క్రికెట్ టోర్నమెంట్

- గట్రావుపల్లి క్రీడా ప్రాంగణంలో ఘన ప్రారంభం

**వేద న్యూస్, కాసిపేట:**



కాసిపేట మండలంలోని గట్రావుపల్లి క్రీడా ప్రాంగణంలో ఆదివాసీ యువతలో క్రీడాస్ఫూర్తి, ఐక్యతను పెంపొందించే లక్ష్యంతో నిర్వహించిన ఆదివాసీ మెగా క్రికెట్ టోర్నమెంట్ బుధవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ టోర్నమెంట్‌ను స్థానిక సర్పంచ్ ఆత్రం గంగుబాయి రిబ్బన్ కట్ చేసి, బ్యాటింగ్ చేసి అధికారికంగా ప్రారంభించారు. ఈ టోర్నమెంట్‌లో వివిధ గ్రామాల నుంచి వచ్చిన జట్లు ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకుని ఉత్సాహంగా పాల్గొంటుండగా, గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. యువత క్రీడలవైపు ఆకర్షితులవడం వల్ల చెడు అలవాట్లకు దూరంగా ఉండి, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి క్రీడలు దోహదపడతాయని అతిథులు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. క్రీడలు యువతను ఆరోగ్యంగా ఉంచడమే కాకుండా క్రమశిక్షణ, జట్టు భావం, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని అన్నారు. గ్రామీణ, ఆదివాసీ ప్రాంతాల్లో ఇలాంటి క్రీడా పోటీలు నిర్వహించడం ద్వారా దాగి ఉన్న క్రీడా ప్రతిభ వెలుగులోకి వస్తుందని పేర్కొన్నారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సోనాపూర్ సర్పంచ్ ఆర్క మహేందర్, మల్కేపల్లి సర్పంచ్ కొట్నాక రఘుపతి, తాటిగూడ సర్పంచ్ మడావి వెంకటేష్, గట్రావుపల్లి ఉప సర్పంచ్ ఉయిక మోతిరాం, మల్కేపల్లి ఉప సర్పంచ్ సందీప్, మాజీ సర్పంచులు, తుడుందెబ్బ రాష్ట్ర, జిల్లా నాయకులు, ఆదివాసీ నాయకపోడ్ రాష్ట్ర నాయకులు, సీఆర్పీఎఫ్ జవాన్, వార్డు మెంబర్లు, టోర్నమెంట్ నిర్వాహకులు ఆత్రం రాజు, సిడం గణపతి, పెందుర్ ప్రభాకర్‌తో పాటు స్థానిక యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మెట్ల మీద నుంచి జారిపడి వృద్ధుడు మృతి

**గోల్నాక, వేద న్యూస్ :**

మద్యం మత్తులో జారిపడి ఓ వృద్ధుడు మృతి చెందిన ఘటన అంబర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై సురేశ్ తెలిపిన వివరాల ప్రకారం..రామంతాపూర్ గోకులేనగర్‌కు చెందిన కృష్ణమూర్తి వేదరమణ అలియాస్ శ్రీధర్ (62) మద్యానికి బానిసగా మారి నిత్యం మద్యం సేవిస్తుంటాడు. కాగా, గత మంగళవారం రాత్రి బాగ్అంబర్‌పేట ఎరకుల బస్తీలోని తెలిసిన వారింటికని వెళ్లి భవనం మెట్లు ఎక్కే క్రమంలో మద్యం మత్తులో ప్రమాదవశాత్తు జారి పడి తీవ్రగాయాలు కాగా అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కూతురు ధర్మపురి శారద ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# సీఎం కప్-2వ ఎడిషన్ టార్చ్ ర్యాలీకి హాజరు కావాలి

- కాసిపేట ఎంపీడీఓ సత్యనారాయణ సింగ్

**వేద న్యూస్, కాసిపేట:**

సీఎం కప్ రెండవ ఎడిషన్ కార్యక్రమంలో భాగంగా నేటి ఉదయం 10 గంటలకు కాసిపేట మండల కేంద్రంలో టార్చ్ ర్యాలీ నిర్వహించనున్నట్లు మండల ఎంపీడీఓ సత్యనారాయణ సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ టార్చ్ ర్యాలీ మోడల్ స్కూల్, ముత్యంపెల్లి నుంచి ఆటో స్టాండ్ వరకు కొనసాగుతుందని చెప్పారు. యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడం, క్రీడల ప్రాధాన్యతను ప్రజలకు తెలియజేయడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ టార్చ్ ర్యాలీకి మండలంలోని సమస్త సర్పంచులు, మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు, మండల సెక్రటరీలు, పాఠశాల విద్యార్థులు, క్రీడాకారులు, క్రీడా సంఘాలు, యువజన సంఘాల ప్రతినిధులు తప్పనిసరిగా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ కోరారు.

# డిజిటల్ యుగంలో నేరాలు పెరుగుతున్నాయి

- మహిళలు, పిల్లల భద్రతే లక్ష్యం
- ఫ్రాడ్‌కు ఫుల్‌స్టాప్.. థింక్ బిఫోర్ యు క్లిక్
- ప్రతి విద్యార్థి మరో ముగ్గురికి సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలి
- మెదక్ జిల్లా అదనపు ఎస్పీ ఎస్. మహేందర్

**వేద న్యూస్, మెదక్:**

డిజిటల్ యుగంలో సైబర్ నేరాలు పెరుగుతున్నాయని, అపరిచితులను నమ్మి వ్యక్తిగత వివరాలు, ఓటీపీలు పంచుకోవద్దని జిల్లా అదనపు ఎస్పీ ఎస్. మహేందర్ హెచ్చరించారు. ప్రతి విద్యార్థి తాను తెలుసుకున్న సైబర్ భద్రతా సమాచారాన్ని కనీసం మరో ముగ్గురికి చేరవేయాలని పిలుపునిచ్చారు. సైబర్ జాగ్రూకత దివస్‌ను పురస్కరించుకొని 'స్టాప్ సైబర్ క్రైమ్' అవగాహన కార్యక్రమాన్ని మెదక్ పట్టణంలోని తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మెదక్ జిల్లా అదనపు ఎస్పీ ఎస్. మహేందర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సుమారు 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మహేందర్ మాట్లాడుతూ.. సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930 జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు కాల్ చేయాలని లేదా ఆన్‌లైన్ లో ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో విద్యార్థులతో సైబర్ భద్రతపై ప్రతిజ్ఞ చేయించి, క్విజ్‌లో పాల్గొన్న వారికి సర్టిఫికెట్లు అందజేశారు. డేటింగ్ యాప్ మోసాలు, సైబర్ బుల్లీయింగ్, సైబర్ స్టాల్కింగ్, మ్యాట్రిమోనియల్ ఫ్రాడ్స్, ఆన్‌లైన్ మోసాలు, ఫేక్ లింకులు, ఓటీపీ మోసాలు, సోషల్ మీడియా హ్యాకింగ్ వంటి సైబర్ నేరాలపై వీడియోల ద్వారా అవగాహన కల్పించారు. మహిళలు, పిల్లలపై జరిగే సైబర్ నేరాలపై భయపడకుండా వెంటనే ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సైబర్ క్రైమ్ డీఎస్పీ సుభాష్ చంద్రబోస్, కళాశాల ప్రిన్సిపాల్ ఉమాదేవి, అధ్యాపకులు, సైబర్ క్రైమ్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు



# జిల్లాలో పార్టీని అగ్రస్థానంలో నిలుపుతా

- హనుమకొండ డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి

**వేద న్యూస్, హనుమకొండ :**

హనుమకొండ జిల్లా నూతన కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా వరంగల్ కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి హనుమకొండలోని పార్టీ కార్యాలయంలో రాష్ట్ర మంత్రి, పార్లమెంటు సభ్యులు, ఎమ్మెల్యేల నడుమ అట్టహాసంగా తన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డికి, ఇనగాల వెంకట్రామ్ రెడ్డికి ఘనంగా అభినందన సభ నిర్వహించారు. ఈసందర్భంగా భారీ సంఖ్యలో ఉమ్మడి వరంగల్ జిల్లా నలుమూలల నుండి వేలాదిగా అభిమానులు, కార్యకర్తలతో పార్టీ కార్యాలయం కాంగ్రెస్ జెండాలతో నిండిపోయింది. ఈ కార్యక్రమానికి వరంగల్ ఇంచార్జి మినిస్టర్ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తెలంగాణ ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు) వేం నరేందర్ రెడ్డి, మంత్రులు ధనసరి సీతక్క, వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు కడియం కావ్య, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు దొంతి మాధవ రెడ్డి, రేవూరి ప్రకాష్ రెడ్డి, కడియం శ్రీహరి, కే.ఆర్.నాగరాజు సమక్షంలో వెంకట్రామ్ రెడ్డి తన ఛాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ఇనగాల వెంకట్రామ్ రెడ్డి చేసిన కృషిని కొనియాడారు. జిల్లాలో పార్టీని క్షేత్రస్థాయికి తీస్తుళ్లడంలో ఆయన అనుభవం ఎంతో ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే, ప్రజా సమస్యల పరిష్కారంలో ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి నిరంతరం శ్రమిస్తున్నారని ప్రశం సించారు. కష్టపడి పనిచేసే కార్యకర్తలకు పార్టీలో ఎల్లప్పు డూ గుర్తింపు ఉంటుందని వారు పేర్కొన్నారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఇన గాల వెంకట్రామ్ రెడ్డి మాట్లాడుతూ.. తన పై నమ్మ కంతో ఈ బాధ్యతను అప్పగించిన పార్టీ అధిష్టానా నికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యకర్తలే పార్టీకి బలమని, మంత్రులు మరియు సీనియర్ నాయకుల మార్గదర్శకత్వం లో, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ జిల్లాలో పార్టీని అగ్రస్థానంలో నిలుపుతాను అని మాటిచ్చారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ, ప్రభుత్వ సంక్షమ పథకాలను ప్రజల్లోకి తీస్తుళ్లడమే నా ప్రథమ ప్రాధాన్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ గుండు సుధారాణి, హుజురాబాద్ నియోజకవర్గం ఇంచార్జి వొడితల ప్రణవ్, టిపిసిసి సభ్యులు బొద్దిరెడ్డి ప్రభాకర్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఇ.వి. శ్రీనివాస్ రావు, వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, జిల్లా గ్రంథలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్, కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, మహిళా నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# కబ్జా స్థలాలు కళాశాలకు అప్పగించాలి

**వేద న్యూస్, జమ్మికుంట:**

జమ్మికుంట పట్టణ నడిబొడ్డున కేంద్ర బిందువుగా ఉన్న కళాశాల మైదానంకి కేంద్ర నిధులు రూ. 6 కోట్లు మంజూరు చేసినందుకు కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ కి సామాజిక కార్యకర్త గట్టు సాయిరాం ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు . అయితే కళాశాల మైదానమును కొంతమంది కబ్జాదారులు కబ్జా చేసినారనీ, కావున వెంటనే కబ్జా స్థలాలను గుర్తించి ప్రభుత్వ బోర్డులను ఏర్పాటు చేసి ఆ స్థలాలను ప్రభుత్వ కళాశాలకు అప్పగించిన తర్వాత మాత్రమే ట్రాక్ నీ నిర్మించాలి అని గట్టు సాయిరాం తెలియజేశారు. గతంలో కబ్జా స్థలాల గురించి అనేక అక్రమ కేసులకు లాటి దెబ్బలకు సైతం భయపడకుండా అనేక ఉద్యమాలు చేశామనీ, కావున కేంద్ర బిందువుగా ఉన్నటువంటి కళాశాల మైదానంలో ఆడపడుచులు బతుకమ్మ పండుగ చేసుకోవడానికి అలాగే చిన్న పిల్లలు ఆటలు ఆడుకోవడానికి, వాకర్స్ కి ఉపయోగపడుతుందనీ..కావున ఈ ట్రాక్ విషయంలో జమ్మికుంట ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అందరికి సౌకర్యంగా ఉండే విధంగా ఉంటేనే ట్రాక్ నిర్మాణం జరగాలనీ అన్నారు . ఈ కార్యక్రమంలో కొత్త గణపతి రెడ్డి , సందీప్, నవీన్ , నిరూప్, అనిల్, అఖిరానందన్ , శ్రీకాంత్, సురేష్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.



Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073